నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

RNI - TELTEL/2023/87644

సంచిక : 130 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | గురువారం | 7-8-2025 పేజీలు -8 | వెల: రూ. 5.00


## నీలగిరి నిత్యపద్యం

ఆటవెలది

---------------

చీరకట్టు తెలిపె భారతీయ ఘనత
సాంప్రదాయమైన సంస్కృతిగను
పొట్టిదుస్తులంట పొరుగుదేశపు తీరు
వలదువలదు మనకు పరువుబోవు

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి


## విలేకరులు కావలెను

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్): & చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:- 9705770909 సంప్రదించండి.




# బీసీ రిజర్వేషన్లపై మీకెందుకు కక్ష

### బీసీ బిల్లు ఆమోదించకపోతే మోదీని గద్దె దించుతాం

### తెలంగాణపై గుజరాతీల పెత్తనం ఏంది?

- 42శాతం రిజర్వేషన్లు ఇస్తారా.. గద్దె దింపాలా?
- మోడీపై నేరుగా విమర్శలు గుప్పించిన సీఎం రేవంత్
- ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద ధర్నాల ఉద్వేగ పూరిత ప్రసంగం
- బీజేపీ,బీఆర్ఎస్ తీరును తప్పు పట్టిన రేవంత్ రెడ్డి

**న్యూఢిల్లీ, ఆగస్టు 6(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

బీసీ రిజర్వేషన్ల బిల్లులకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపకపోతే.. ప్రధాని మోడీని గద్దెదించి, రాహుల్ గాంధీని ప్రధానిని చేసుకుని బీసీ రిజర్వేషన్లు సాధించుకుంటామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ప్రధాని మోడీ మెడలు వంచేందుకే ఢిల్లీలో మహాధర్నా చేపట్టామని.. కేంద్ర ప్రభుత్వం బీసీ బిల్లులకు ఆమోదం తెలకపపోతే ప్రధాని మోడీని గద్దె దింపుతామని హెచ్చరించారు. బీజేపీ మాతృ సంస్థ ఆర్ఎస్ఎస్ చెప్పినా మోడీ ప్రధాని పదవి వదులుకోవడం లేదని.. 75 ఏళ్ల నిబంధన ఆయనకి వర్తించదా అని ప్రశ్నించారు. మోడీ గద్దె దిగినా.. దిగకపోయినా.. 2029లో మేమే ఆయనను

-మిగతా 2 లో



## ఢిల్లీలో రేవంత్ రెడ్డి అండ్ బ్యాచ్ డ్రామా అట్టర్ ఫ్లాప్..

- దొంగ దీక్షకు.. కూతవేటు దూరంలో ఉండి రాహుల్ గాంధీ రాలేదు
- బిహారే ముఖ్యమని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే రాలేదు
- బీసీ ధర్నాపై హరీశ్‌రావు సెటైర్లు

**హైదరాబాద్, ఆగస్టు 6(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

బీసీలకు 42శాతం కోటా పేరిట సీఎం రేవంత్ రెడ్డి అండ్ బ్యాచ్ ఢిల్లీ వెళ్లిన చేసిన డ్రామా అట్టర్ ఫ్లాప్ అయ్యిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శించారు. ఢిల్లీ వేదికగా నిర్వహించిన దొంగ దీక్షకు.. కూతవేటు దూరంలో ఉండి రాహుల్ గాంధీ రాలేదని.. మాకు బీసీల కన్నా బిహారే ముఖ్యమని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే రాలేదని తెలిపారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సీఎం రేవంత్ రెడ్డి నిర్వహించిన బీసీ ధర్నాపై

-మిగతా 2 లో



## ప్రధాని మోడీ చైనా పర్యటన ఖరారు

- 2019 తర్వాత తొలిసారి
- ఆగస్టు 31 నుంచి రెండ్రోజుల పర్యటన

**న్యూఢిల్లీ,ఆగస్టు 6(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చైనా పర్యటన ఖరారైంది. ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 1 వరకూ.. రెండు రోజుల పాటూ చైనాలో ప్రధాని పర్యటించనున్నారు. అక్కడ టియాంజిన్‌లో జరగనున్న షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సమావేశంలో పాల్గొననున్నారు. ఇక చైనా పర్యటన అనంతరం ప్రధాని మోదీ జపాన్ పర్యటనకు

-మిగతా 2 లో



## ఆ ఓటర్ల వివరాలు వెల్లడించండి

- ఈసీకి సుప్రీంకోర్టు ఆదేశాలు

**న్యూఢిల్లీ**

బీహార్‌లో ఓటర్ల జాబితా సవరణ తర్వాత సుమారు 65 లక్షల మంది ఓటర్లను లిస్టు నుంచి తొలగించిన విషయం తెలిసిందే. అయితే డిలీట్ చేసిన ఆ 65 లక్షల ఓటర్ల వివరాలను వెల్లడించాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఇవాళ సుప్రీంకోర్టు ఆదేశించింది. ఆగస్టు 12 లేదా 13వ తేదీల్లో బీహార్ సిర్ ప్రక్రియపై సుప్రీంకోర్టులో మళ్లీ విచారణ జరగనున్నది. ఈ నేపథ్యంలో తొలగించిన ఓటర్ల వివరాలను బహిర్గతం చేయాలని

-మిగతా 2 లో

## మరోసారి భారత్‌ను టార్గెట్ చేసిన డొనాల్డ్ ట్రంప్..

- అదనంగా 25శాతం సుంకాలు..
- ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకాలు..!

**న్యూఢిల్లీ, ఆగస్టు 6(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి భారత్‌ను మరోసారి టార్గెట్ చేశారు. మిత్రదేశం అని చెప్పుకుంటూనే 50శాతం సుంకాలు విధించారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేపడుతుండడంతోపై ట్రంప్ 25శాతం అదనంగా సుంకాలు విధించారు. సుంకాలు అమలు చేసేందుకు బుధవారం ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకాలు చేశారు. సుంకాలు ఆగస్టు 7 నుంచి అమలులోకి రానున్నాయి.

-మిగతా 2 లో



## ఉత్తరాఖండ్ జలప్రళయం..

### 28 మంది కేరళ పర్యాటకుల బృందం గల్లంతు

**న్యూఢిల్లీ,**



ఉత్తరాఖండ్ జలప్రళయంతో అక్కడికి వెళ్లిన 28 మంది పర్యాటకుల బృందం గల్లంతైంది. ఆ బృందంలోని వారిలో 20 మంది మహారాష్ట్రలో స్థిరపడిన వారు కాగా, మిగిలిన 8 మంది కేరళలోని వివిధ జిల్లాలకు చెందిన వారిగా తెలిసింది. వారిలో ఓ దంపతులకు చెందిన బంధువు మీడియాతో మాట్లాడుతూ.. తాను వారితో మాట్లాడి ఒకరోజు గడిచిందన్నారు.తాము మాట్లాడినప్పుడు వారు ఉత్తరకాశీ నుంచి ఉదయం

-మిగతా 2 లో

## బీసీలపై కాంగ్రెస్ ది దొంగ ప్రేమ

- 50ఏళ్ల పాలనలో బీసీలకు ఎనలేని నష్టం
- కేంద్ర మంత్రి బండిసంజయ్



**హైదరాబాద్,**

50 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో ఏనాడైనా బీసీలను పట్టించుకున్న దాఖలాలు ఉన్నాయా?.. సీఎంను చేసిన లెక్కలు ఉన్నాయా ఉంటే చెప్పాలని కేంద్ర మంత్రి బండిసంజయ్ ప్రశ్నించారు. ముస్లిం రిజర్వేషన్ల కోసమే కాంగ్రెస్ ధర్నా చేస్తోందని ఆరోపణలు చేశారు. ఇది కామారెడ్డి డిక్లరేషన్ కానే కాదని.. ముమ్మాటికీ ముస్లిం డిక్లరేషనేనని విమర్శలు చేశారు. బీసీలకు 5శాతం పెంచి.. ముస్లింలకు అదనంగా పదిశాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కుట్ర చేస్తున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఢిల్లీ వేదికగా బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. బీసీ ముసుగులో ముస్లింలకు వంద శాతం రిజర్వేషన్లను అమలు చేసే కుట్ర జరుగుతోందని ఆక్షేపించారు. కాంగ్రెస్ ధర్నాకు బీసీల మద్దతు కరువైందని విమర్శించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తేనే

-మిగతా 2 లో

## కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకి ఊరట

### ప్రతాప్ కుమార్ అనే వ్యక్తి పరువునష్టం కేసు

**హైదరాబాద్,**



కేంద్రం హెూం మంత్రి అమిత్‌షా పరువుకు భంగం కలిగించేలా వాఖ్యలు చేశారనే కేసులో కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీకి ఊరట లభించింది. ఈ కేసులో ఆయనకు జారా?ండ్‌లోని ఎంపీ-ఎమ్మెల్యే కోర్టు బెయిల్ మంజూరు చేసింది. రాహుల్ గాంధీ స్వయంగా చాయిబాసా కోర్టు ముందు బుధవారంనాడు హాజరయ్యారు. దీనికి ముందు, రాహుల్ గాంధీ కోర్టుకు హాజరవుతున్న నేపథ్యంలో కోర్టు చుట్టూ భద్రతను పెంచారు. శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకుని స్థానిక యంత్రాంగం భద్రతా ఏర్పాట్లు చేసింది. రాంచీ నుంచి చాయిబాసాకు రాహుల్ హెలికాప్టర్‌లో వచ్చారు. ఇందుకోసం టాటా కాలేజీ గ్రౌండ్స్‌లో హెలిప్యాడ్ ఏర్పాటు చేశారు.

-మిగతా 2 లో



## ప్రజలను భ్రమ పెట్టేందుకే ఢిల్లీలో ధర్నాలు

- కాంగ్రెస్‌పై ఎమ్మెల్సీ కవిత ఘాటు విమర్శలు

**హైదరాబాద్, ఆగస్టు 6(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

బీసీల రిజర్వేషన్ల బిల్లు కోసం ప్రజలను భ్రమ పెట్టేందుకే ఢిల్లీలో కాంగ్రెస్ ధర్నా పేరుతో నాటకాలు ఆడుతుందని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. సామాజిక తెలంగాణ అంటే ఢిల్లీకి వెళ్లి వట్టిగా ధర్నాలు చేయడం కాదని విమర్శలు చేశారు. బుధవారం తెలంగాణ జాగృతి వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా బంజారాహిల్స్‌లోని కార్యాలయంలో జాగృతి జెండాను కవిత ఆవిష్కరించారు. ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా

-మిగతా 2 లో

## కులగణనతో దేశానికి తెలంగాణ రోల్ మాడల్

- 42శాతం రిజర్వేషన్తలో వారికి అండగా నిలబడ్డాం
- బీసీ కోటా బిల్లును తొక్కిపెట్టిన మోడీ ప్రభుత్వం
- ఢిల్లీ మహాధర్నాలో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్



**న్యూఢిల్లీ ఆగస్టు 6(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

తెలంగాణలో కులగణన చేసి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లులు ఆమోదించామని టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ అన్నారు. కులగణన చేసి దేశానికే తెలంగాణ రోల్ మోడల్‌గా నిలిచిందన్నారు. తెలంగాణ అసెంబ్లీ ఆమోదించి పంపిన బీసీ కోటా బిల్లులను ప్రధాని మోడీ నాలుగు నెలలుగా తొక్కిపెట్టారని విమర్శించారు. బీసీ కోటా బిల్లులకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపితే రాహుల్ గాంధీకి క్రెడిట్ వస్తుందని ప్రధాని మోడీ భయమని ఎద్దేవా చేశారు.ఢిల్లీలో టీ-పీసీసీ చేపట్టిన బీసీ మహాధర్నా చూసైనా కేంద్రంలోని మోడీ

-మిగతా 2 లో

# ఢిల్లీలో రేవంత్ రెడ్డి అండ్ బ్యాచ్ డ్రామా అట్టర్ ఫ్లాప్..

(మొదటి తరువాయి)

హరీశ్‌రావు ట్విట్టర్(ఎక్స్) వేదికగా విమర్శలు గుప్పించారు. మీ ధర్నాలో నిజాయితీ లేదని, బీసీలకు 42శాతం కోటా అమలు చేస్తారనే మాటలపై నమ్మకం రాహుల్ గాంధీ, ఖర్గే లతో పాటు, తెలంగాణ ప్రజలకు కూడా లేదని సుస్పష్టం అయ్యిందని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. "మేం గుజరాత్ లో అడగలేదు, ఉత్తర్ ప్రదేశ్ లో అడగలేదు, మహారాష్ట్రలో అడగలేదు తెలంగాణలోనే బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అడుగుతున్నాం" అని రేవంత్ రెడ్డి ప్రసంగిస్తే.. అదే సమయంలో రాహుల్ గాంధీ గారూ.. "ఈ పోరాటం తెలంగాణ కోసం మాత్రమే కాదు, యావత్ దేశం కోసం చేస్తున్న పోరాటం" అని ట్వీట్ చేస్తరు. ఒకే రోజు, ఒకే సమయంలో సీఎం రేవంత్ రెడ్డి చెప్పిన మాటలకు, రాహుల్ గాంధీ చెప్పిన మాటలకే పొంతన లేదని విమర్శించారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ మీద కాంగ్రెస్ పార్టీకి ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో రెండు నాల్కల ధోరణి చూస్తేనే అర్థమవుతున్నదని అన్నారు. మీరు ప్రజలను కొన్నిసార్లు మోసం చేయవచ్చు లేదా కొంతమంది ప్రజలను అన్నిసార్లు మోసం చేయవచ్చు. కానీ అందర్నీ అన్ని సమయాల్లో మోసం చేయలేరు ' అని అబ్రహం లింకన్ చెప్పిన నీతి వాక్యాన్ని ఈ సందర్భంగా హరీశ్‌రావు ప్రస్తావించారు.

## ప్రధాని మోడీ చైనా
# పర్యటన ఖరారు

(మొదటి తరువాయి)

వెళ్లనున్నారు. 2019 గాల్వాన్ ఘటన తర్వాత ప్రధాని మోదీ చైనా పర్యటకు వెళ్తుండటం ఇదే తొలిసారి. మరోవైపు భారత్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అదనపు సుంకాల వేళ మోదీ చైనా పర్యటనకు ప్రాధాన్యత సంతరించుకుంది.

# ఆ ఓటర్ల వివరాలు వెల్లడించండి

(మొదటి తరువాయి)

సుప్రీంకోర్టు చెప్పింది. జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ ఉజ్వల్ భూయాన్, జస్టిస్ ఎన్ కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం ఈ ఆదేశాలు ఇచ్చింది. డిలీట్ చేసిన ఓటర్ల వివరాలను ఇప్పటికే రాజకీయ పార్టీలకు సమర్పించారని, అయితే ఆ వివరాలను బహిరంగంగా వెల్లడించాలని, ఈ కేసులో పిటీషన్ వేసిన అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్‌కు కూడా ఓ కాపీని ఇవ్వాలని ధర్మాసనం ఆదేశించింది. శనివారం లోగా రిప్లై నమోదు చేయాలని, ఏడీఆర్‌కు చెందిన ప్రశాంత్ భూషణ్ దాన్ని పరిశీలిస్తారని, అప్పుడు ఏ విషయాన్ని వెల్లడించాలి, వెల్లడించకూడదో తెలుస్తుందని బెంచ్ తెలిపింది. డిలీటైన 65 లక్షల ఓటర్లు మరణించార లేక శాశ్వతంగా ఇండ్లు మారారా.. అన్న కారణాలు వెల్లడిస్తూ జాబితాను రిలీజ్ చేయాలని ఏడీఆర్ తన అప్లికేషన్‌లో కోరింది. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు తాజా ఆదేశాలు ఇచ్చింది. డిలీట్ చేసిన లిస్టులో ఉన్న కనీసం 15 మంది బ్రతికి ఉన్నట్లు నిరూపిస్తే, ఈ కేసును తీవ్రంగా పరిగణిస్తామని కోర్టు చెప్పింది.

# ఉత్తరాఖండ్ జలప్రళయం..

(మొదటి తరువాయి)

8.30కు గంగోత్రికి బయల్దేరినట్లు వెల్లడించారని ఆయన తెలిపారు. ఆ తర్వాత వారి మార్గంలో కొండచరియలు విరిగిపడ్డాయని, ఆ తర్వాత నుంచి వారితో ఎలాంటి కాంటాక్టు లేదని చెప్పారు. ఫోన్లలో బ్యాటరీ అయిపోయిందా, లేదంటే వారున్నచోట సిగ్నల్ లేదా, మరేదైనా జరిగిందా అనేది అర్థం కావడంలేదని ఆందోళన వ్యక్తంచేశాడు. అతడు చెప్పిన వివరాల ప్రకారం.. హరిద్వార్‌కు చెందిన ఓ ట్రావెల్ ఏజెన్సీ 10 రోజులపాటు ఉత్తరాఖండ్ ట్రిప్ ఏర్పాటు చేసింది. గంగోత్రికి వెళ్లే మార్గంలో ధరాలీ కీలకమైన స్టాప్. అదేసమయంలో మంగళవారం అక్కడ భారీగా మెరుపు వరద విరుచుకుపడింది. క్షణాల్లో భవనాలు మట్టి కింద కూరుకుపోయాయి. ఈ ఘటనలో ఐదుగురు మృతి చెందారు. డజన్ల మంది ఆచూకీ తెలియాల్సి ఉంది. వారి జాడ కోసం సెర్చ్ అండ్ రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది.

# బీసీలపై కాంగ్రెస్ దొంగ ప్రేమ

(మొదటి తరువాయి)

మద్దతిస్తామని క్లారిటీ ఇచ్చారు. బీసీలకు ఏ పార్టీ ఏం చేసిందో బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు బండి సంజయ్. 50 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఎన్నడైనా బీసీని ప్రధాని చేశారా? అని బండి సంజయ్ ప్రశ్నించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 48 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఒక్క బీసీనైనా సీఎం చేశారా? అని నిలదీశారు. తెలంగాణ కేబినెట్, నామినేటెడ్ పదవుల్లో ఎంతమంది బీసీలకు ఇచ్చారో చర్చిద్దామా? అని సవాల్ విసిరారు. లోక్‌సభ సభ్యుల్లో ఎంతమంది బీసీలకు సీట్లిచ్చారో సమాధానమివ్వగలరా? అని ప్రశ్నల వర్షం కురిపించారు. కాంగ్రెస్ పార్టీనా బీసీల గురించి తమకు నీతులు చెప్పేది? అని నిలదీశారు. బీసీని ప్రధాని చేసిన ఘనత బీజేపీదేనని ఉద్ఘాటించారు బండి సంజయ్. 27మంది బీసీ కేంద్రమంత్రులను, అనేక రాష్ట్రాలకు బీసీ సీఎంలను నియమించిన ఘనత బీజేపీదేనని బండి సంజయ్ కేంద్రంపై నెపం మోసిందని చెప్పారు. బీసీ రిజర్వేషన్ల నుంచి కాంగ్రెస్ నేతలు తప్పుకోవాలనుకుంటున్నారని ధ్వజమెత్తారు. యూపీ, బెంగాల్, బిహార్ తరహాలో తెలంగాణలోనూ కాంగ్రెస్ కనుమరుగవడం తథ్యమని బండి సంజయ్ హెచ్చరించారు. ఈరోజు న్యూఢిల్లీలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ముస్లింలకు వంద శాతం రిజర్వేషన్లు కల్పించేందుకే జంతర్ మంతర్ వద్ద ధర్నా చేస్తోందే తప్పా బీసీల కోసం కానేకాదని స్పష్టం చేశారు. కామారెడ్డి డిక్లరేషన్‌పై కాంగ్రెస్ మాట తప్పిందని విమర్శించారు. మైనార్టీ ఓట్ల కోసం ముస్లిం డిక్లరేషన్‌ను అమలు చేయాలనుకుంటోందని విమర్శించారు. బీసీలను ఘోరంగా మోసం చేస్తోంది. అందుకే కాంగ్రెస్ ధర్నాకు బీసీల మద్దతు కరువైందని బండి సంజయ్ ఆక్షేపించారు.

# కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకి ఊరట

(మొదటి తరువాయి)

జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి శిబుసోరెన్ అంత్యక్రియలకు హాజరయ్యేందుకు రాహుల్ మంగళవారంనాడు రాష్ట్రానికి వచ్చారు. రాహుల్ గాంధీ 2018లో జరిగిన ఒక ర్యాలీలో అమిత్‌షా పరువుకు భంగం కలిగించేలా వ్యాఖ్యలు చేశారంటూ ప్రతాప్ కుమార్ అనే వ్యక్తి పరువునష్టం కేసు వేశారు. జూన్ 26న ప్రత్యేక కోర్టు ముందు రాహుల్ హాజరు కావాల్సి ఉండగా ఆయన తరఫు న్యాయవాది తన క్లయింట్ ఆరోజు హాజరుకాలేరని, ఆగస్టు 6వ తేదీని హాజరయ్యేందుకు వీలు కల్పించాలని కోర్టును కోరారు.

# బీసీ రిజర్వేషన్లపై మీకెందుకు కక్ష

(మొదటి తరువాయి)

గద్దె దింపి.. రాహుల్ గాంధీని ప్రధానిని చేసుకుంటామని..ఇదే మా శపథమని ఘాటు వ్యాఖ్యలు చేశారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని 150 సీట్లకే పరిమితం చేస్తామని సవాల్ విసిరారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను కేంద్ర ప్రభుత్వం ఆమోదించాలని డిమాండ్ చేస్తూ టీ-పీసీసీ ఆధ్వర్యంలో బుధవారం ఢిల్లీలోని జంతర్ మంతర్ దగ్గర మహాధర్నా చేపట్టారు. ఈ ధర్నాలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ..రిజర్వేషన్లు 42 శాతం ఇవ్వాలని రెండు బిల్లులను ఆమోదించాం. ఆనాటి సీఎం కేసీఆర్ బీసీలపై కక్ష్య గట్టి తెలంగాణలో 50 శాతం మించకుండా చట్టం చేశారు. బలహీన వర్గాలకు అన్యాయం చేసే చట్టాన్ని తొలగించేందుకు ఆర్డినెన్స్ తీసుకొచ్చాం. విద్యా, ఉద్యోగాలు, రాజకీయాల్లో 42 శాతం రిజర్వేషన్ల బిల్లును చట్టం చేసి గవర్నర్ రాష్ట్రపతికి పంపించారు. 50 శాతం క్యాప్‌ను తొలగించే ఆర్డినెన్స్ కూడా రాష్ట్రపతి దగ్గరకు వచ్చింది. నాలుగు నెలలు గడిచినా ఆమోదం లేదు. బీసీలకు అన్యాయం చేస్తుంటే గల్లీ నుంచి ఢిల్లీకి వచ్చి ధర్నా చేపట్టాం అని అన్నారు. హైదరాబాద్‌లో, తెలంగాణలో చేస్తే తెలంగాణ వ్యాప్తంగా ఉన్న పార్టీల మద్దతు మాత్రమే ఉంటుంది. ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద చేస్తే దేశ వ్యాప్తంగా ఉన్న పార్టీల మద్దతు ఇస్తున్నారు. అదే విధంగా ఇండియా కూటమి పార్టీలు, నేతలు కూడా మద్ధతు ఇస్తున్నారు. తెలంగాణ కోసం పార్లమెంటులో మోదీ సర్కార్?తో కొట్లాడుతామని ధర్నాకు వచ్చి అండగా నిలిచారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు జోడో యాత్ర చేసి దేశానికి రాహుల్ హామీ ఇచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో కులగణన చేస్తామని తెలంగాణ ప్రజలకు హామీ ఇచ్చారని అంటూ, ఆ హామీ మేరకు 42శాతం చట్టం చేశామని అన్నారు. కామారెడ్డిలో 42 శాతం బీసీ డిక్లరేషన్ ఇచ్చాం. రాహుల్ గాంధీ, సిద్ధరామయ్య కామారెడ్డిలో హామీ ఇచ్చారు. ఉమ్మడి రాష్ట్రంలో కూడా ఏ ఒక్క ముఖ్యమంత్రి చేయని సాహసం మేము చేశాం. కేబినెట్ మంత్రులు నాకు అండగా నిలిచి 300 మంది సీఎంలు చేయలేని పనిని చేసే అవకాశం నాకు కల్పించారు. దేశానికే ఆదర్శంగా నిలబడటానికి తెలంగాణ సీఎంగా నాకు అవకాశం వచ్చింది. రాహుల్ గాంధీ సందేశాన్ని అందిపుచ్చుకుని.. జనగణనలో కులగణన చేయాలని నిర్ణయించాం అని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల బిల్లులకు ఆమోదం తెలపాలని డిమాండ్ చేశారు. మోడీ సర్కార్ బిల్లులకు ఆమోదం తెలిపే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రధాని మోదీ, భాజపా నేతలు బీసీ రిజర్వేషన్ బిల్లులను అడ్డుకొని బలహీనవర్గాలకు అన్యాయం చేస్తున్నారని రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణలో బీసీ రిజర్వేషన్లు ఇస్తామంటే గుజరాత్ వారికి కడుపుమంట ఎందుకని ఆగ్రహం వ్యక్తం చేశారు. గల్లీలో ఉండలేక దిల్లీలోనే తేల్చుకుందామని 'చలో దిల్లీ' చేపట్టామని చెప్పారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఎలాగైనా సాధిస్తామన్నారు. దిల్లీలో ధర్నాకు వంద మంది ఎంపీలు, ఇండియా కూటమి పార్టీలు మద్దతు ఇచ్చాయన్నారు. బీసీ రిజర్వేషన్ల కోసం 4 కోట్ల మంది ముక్త కంఠంతో విజ్ఞప్తి చేశారు. జంతర్ మంతర్ వేదికగా మోదీ, ఎన్డీయేకు సవాల్ విసురుతున్నా. మా డిమాండ్‌ను ఆమోదిస్తారా? మిమ్మల్ని గద్దె దించాలా? మా ఆలోచనలు, బిల్లులను తుంగలో తొక్కే అధికారం మీకు ఎవరిచ్చారు? మోదీ మన బద్ధశత్రువు.. బలహీనవర్గాలకు న్యాయం చేసే ఆలోచన ఆయనకు లేదు. ఆయన మోచేతి నీళ్లు తాగే కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రామచంద్రరావుకు ఏమైంది? తెలంగాణలో మీరు బలహీనవర్గాలను ఓట్లు అడగలేదా? ప్రజలతో మీ అవసరం తీరిపోయిందా? పేరు బంధం తెగిన తెరాస పేగు బంధం కూడా తెలంగాణతో తెగిందా అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఈసందర్భంగా బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై మరోసారి విరుచుపడ్డారు సీఎం రేవంత్ రెడ్డి. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కాంగ్రెస్ ప్రభుత్వం సంకల్పిస్తే.. ఆ రెండు పార్టీలు మోకాలడ్డేస్తున్నాయని ఫైర్ అయ్యారు. బలహీన వర్గాలకు రిజర్వేషన్లు ఇవ్వాలని అసెంబ్లీలో మేం బిల్లులు ఆమోదిస్తే.. మా బిల్లును తుంగలో తొక్కే హక్కు మీకు ఎవరిచ్చారని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బీసీ పేరుతో కాంగ్రెస్ డ్రామాలేస్తుందని డ్రామారావు అంటుండు. కానీ డ్రామాలు ఆడేదే కల్వకుంట్ల ఫ్యామిలీ అని తెలంగాణ రాష్ట్రమంతా తెలుసని రేవంత్ కౌంటర్ ఇచ్చారు. డ్రామా మీ కుటుంబంలో ఉంటే.. బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలనే చిత్తశుద్ధి మాకుందన్నారు. మీ ఇంట్లనే పరిస్థితి సక్కగ లేదు. ఒకరు బీసీలకు మద్ధతు అంటారు.. ఇంకొకాయన అసలు మాట్లాడరు.. మరొకరు మధ్యరకం అంటారు.. అటు- ఇటు- గానీ వాళ్లు నా గురించి మాట్లాతారా అని ఫైర్ అయ్యారు. వంద మీటర్ల గోతి తొవ్వి పాతిపెట్టినా మీకు బుద్ధి రాలేదని బీఆర్ఎస్‌ను కడిగిపారేశారు.

బీసీ రిజర్వేషన్ల బిల్లులకు అసెంబ్లీలో మద్దతు తెలిపిన బీఆర్ఎస్.. ఆ బిల్లులకు కేంద్రం ఆమోదం తెలపాలని ఢిల్లీలో కాంగ్రెస్ చేపట్టిన మహాధర్నాకు ఎందుకు రాలేదని ప్రశ్నించారు. బీసీల ఓట్లు- మీకు అవసరం లేదా.. బలహీనవర్గాల పట్ల ఇదేనా మీ చిత్తశుద్ధి అని నిలదీశారు. బీసీ రిజర్వేషన్ల బిల్లుల ఆమోదించాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ ఎందుకు నిలదీయట్లేదని ప్రశ్నించారు.

బలహీన వర్గాలకు అన్యాయం చేసే ఆ చట్టాన్ని తొలగించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకొచ్చిందని.. ఆ ఆర్డినెన్స్‌ను కూడా కేంద్ర ప్రభుత్వం తొక్కిపెట్టిందన్నారు. ఈ ధర్నాలు మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యలే తదితరులు పాల్గొన్నారు.

# మరోసారి భారత్‌ను టార్గెట్ చేసిన డొనాల్డ్ ట్రంప్..

(మొదటి తరువాయి)

అదనపు సుంకాలు 21 రోజుల తర్వాత అమలులోకి వస్తుంది. ట్రంప్ తొలి సుంకాలు అమలులోకి రావడానికి 14గంటల ముందు అదనంగా సుంకాలు విధించేందుకు ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వులపై సంతకాలు చేశారు. జులై 30న ట్రంప్ భారత్ నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై 25శాతం సుంకాలు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ పన్నుల ఆగస్టు 7 నుంచి అమలులోకి రానుండగా.. అదనపు సుంతకాలు ఆగస్టు 27 నుంచి అమలులోకి వస్తాయి. రష్యా నుంచి భారీగా చమురును కొనుగోలు చేస్తుందని.. తద్వారా ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని కొనసాగించేందుకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు సహాయపడుతుందని ట్రంప్ పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు సంతకాలు చేసిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ ప్రకారం.. రష్యాపై ఉక్రెయిన్ దాడి కారణంగా మార్చి 8, 2022న కొన్ని దిగుమతులు, పెట్టుబడులను నిషేధించారు. ఏప్రిల్ 15, 2021న అమెరికా సైతం ఓ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకాలు చేసింది. ఈ ఉత్తర్వు ప్రకారం.. రష్యా నుంచి ముడి చమురు, పెట్రోలియం, పెట్రోలియం ఇంధనం, సంబంధిత ఉత్పత్తులను దిగుమతి చేసుకోవడాన్ని అమెరికాలో నిషేధించారు. రెండో ఉత్తర్వు ప్రకారం.. భారతదేశంపై సుంకాలు విధించే ఉత్తర్వుపై ట్రంప్ సంతకం చేశారు. అధ్యక్షుడు ట్రంప్ సంతకం చేసిన కార్యనిర్వాహక ఉత్తర్వులో.. భారత ప్రభుత్వం ప్రస్తుతం రష్యన్ ఫెడరేషన్ నుంచి ప్రత్యక్షంగా, పరోక్షంగా చమురును దిగుమతి చేసుకుంటున్నట్లు తెలిసింది. వర్తించే చట్టాల ప్రకారం.. యునైటెడ్ స్టేట్స్ కస్టమ్స్ భూభాగంలో భారతదేశం నుంచి దిగుమతి చేసుకున్న వస్తువులపై 25 శాతం అదనపు సుంకం విధించబడుతుంది. ఈ ఉత్తర్వులోని సెక్షన్ 3 ప్రకారం.. వినియోగం కోసం యూఎస్‌లోకి ప్రవేశించే, వినియోగం కోసం గోడౌన్ నుంచి తొలగించబడిన వస్తువులపై ఈ సుంకం వర్తిస్తుంది. ఈ అదనపు సుంకం 21 రోజుల తర్వాత అంటే ఆగస్టు 27 నుంచి అమల్లోకి వస్తుంది. అయితే, ఈ మినహాయింపు ఓడరేవు నుంచి నౌకలో లోడ్ చేయబడిన, తుది రవాణా మోడ్‌లో 21 రోజుల్లోపు యూఎస్‌లోకి ప్రవేశించిన వస్తువులకు వర్తిస్తుంది. ఇతర దేశాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా రష్యన్ చమురును కొనుగోలు చేస్తున్నాయో లేదో తెలుసుకునే పనిని అధ్యక్షుడు ట్రంప్ తన వాణిజ్య మంత్రికి అప్పగించారు. ఈ దేశాలపై ప్రతీకార సుంకాలు విధిస్తామని కూడా ట్రంప్ హెచ్చరించారు. ట్రంప్ సోమవారం భారత్‌పై భారీ సుంకాలు విధిస్తామని చెప్పిన విషయం తెలిసిందే. భారతదేశం నుంచి అమెరికాకు పంపే వస్తువులపై సుంకాలు పెద్ద మొత్తంలో పెంచబోతున్నామన్నారు. రష్యా నుంచి పెద్ద మొత్తంలో ముడి చమురును కొనుగోలు చేసి, దానిని ఇతర దేశాలకు అమ్మి, దాన్నుంచి భారీ లాభాలను ఆర్జిస్తోందని ట్రంప్ ఆరోపించారు. గత వారం ట్రంప్ భారత దిగుమతులపై 25 శాతం సుంకాన్ని.. అలాగే రష్యా నుంచి చమురు, గ్యాస్ కొనుగోలు చేసినందుకు ప్రతీకార సుంకాలను ప్రకటించారు.

# ప్రజలను భ్రమ పెట్టేందుకే ఢిల్లీలో ధర్నాలు

(మొదటి తరువాయి)

కవిత మీడియాతో మాట్లాడారు. బీసీలకు ఇచ్చే 42 శాతం రిజర్వేషన్‌లో ముస్లింలు ఉండవద్దని ముందు నుంచి బండి సంజయ్ మాట్లాడుతునే ఉన్నారని చెప్పుకొచ్చారు. బీజేపీ బీసీలను మోసం చేస్తోందని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమం సమయంలో ప్రతి ఒక్క పార్టీతో జై తెలంగాణ అనిపించామని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జై తెలంగాణ అని ఎందుకు అనడం లేదని ప్రశ్నించారు. బీసీల కోసం తాము హైదరాబాద్‌లో 72గంటల పాటు దీక్ష చేశామని ఉద్ఘాటించారు. కోర్టు నుంచి తమకు పర్మిషన్ రాలేదని గుర్తుచేశారు. కాంగ్రెస్ నాయకులు ఢిల్లీలో దొంగ దీక్షలు చేయడం కాదని, నిజమైన దీక్షలు చేయాలని హితవు పలికారు ఎమ్మెల్సీ కవిత. జాగృతిలోకి వచ్చేందుకు చాలామంది రెడీగా ఉన్నారని.. తమకు అన్నివర్గాల మద్దతు వస్తోందని ఎమ్మెల్సీ కవిత స్పష్టం చేశారు. బీసీల కోసం కాంగ్రెస్, బీజేపీ రెండు పార్టీలు చిత్తశుద్ధితో పని చేయటం లేదని మండిపడ్డారు. బీసీల కోసం జాగృతి కార్యచరణ సిద్ధం చేస్తుందని ప్రకటించారు. ముస్లిం రిజర్వేషన్లపై బండి సంజయ్ మాట్లాడకపోతేనే విచిత్రమని ఎద్దేవా చేశారు. బీసీ రిజర్వేషన్‌లపై కాంగ్రెస్ ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలని, అన్ని పార్టీల నాయకులకు లేఖలు రాయాలని సూచించారు. రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ తీసుకొని, అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకొని వెళ్లాలనీ ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమం సమయంలో కేసీఆర్ చెప్పినట్లుగా, వారి బాటలో తెలంగాణ జాగృతి ముందుకు వెళ్లిందని ఉద్ఘాటించారు. జయశంకర్ సార్ ఆలోచనలను తూచా తప్పకుండా పాటించామని చెప్పుకొచ్చారు. తెలంగాణ చూడకుండానే జయ శంకర్ సార్ దూరం అయ్యారని ఆవేదన వ్యక్తంచేశారు. జయ శంకర్ సార్ జయంతి సందర్భంగా జాగృతి ఫౌండేషన్ డే జరుపుకుంటున్నామని తెలిపారు. సామాజిక తెలంగాణ కోసం పాటుపడాలని జయశంకర్ సార్ అనేక సార్లు చెప్పారని గుర్తుచేసుకున్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అన్నివర్గాల వారికి సమన్యాయం జరగాలని జయశంకర్ సార్ చెప్పే వారని పేర్కొన్నారు.

## కులగణనతో దేశానికి
# తెలంగాణ రోల్ మాడల్

(మొదటి తరువాయి)

సర్కార్ కు కనువిప్పు కలగాలని..మోడీ తల్చుకుంటే సాయంత్రాని కే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు అవుతాయని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను కేంద్ర ప్రభుత్వం ఆమోదించాలని డిమాండ్ చేస్తూ టీ-పీసీసీ ఆధ్వర్యంలో బుధవారం ఢిల్లీలోని జంతర్ మంతర్ దగ్గర మహాధర్నా చేపట్టారు. ఈ ధర్నాలో మహేష్ గౌడ్ మాట్లాడుతూ.. బీసీ కోటా బిల్లు తేవటం చారిత్రాత్మకమన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయం తీసుకున్న మొనగాడు సీఎం రేవంత్ రెడ్డి అని.. ఆయన చరిత్రలో నిలిచిపోతారని కొనియాడారు. బీసీ కోటా బిల్లుతో మోడీ పరేషాన్లో ఉన్నారని అన్నారు. ఇన్నాళ్లు బీసీలకు రిజర్వేషన్లు అడిగితే ఏ లెక్కన అడుగుతున్నారని అన్నారు. ఇప్పుడు కుల గణన చేసి ఆ లెక్కల ప్రకారం రిజర్వేషన్లు ఇవ్వాలని అడుగుతున్నామన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం తెలంగాణలో కులగణన చేసి అసెంబ్లీలో ఆమోదించామని.. ఇప్పుడు దేశంలోని బీసీలంతా తెలంగాణ వైపు.. రేవంత్ వైపు చూస్తున్నారన్నారు. రాహుల్ గాంధీ ఎక్కడ మాట్లాడినా.. తెలంగాణ వైపు చూడండి.. రేవంత్ వైపు చూడండి అని చెప్తున్నారని అన్నారు. తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన బీసీ కోటా బిల్లులను నాలుగు మాసాలుగా కేంద్ర ప్రభుత్వం తొక్కిపెట్టిందని ఫైర్ అయ్యారు. మోడీకి బీసీల బాధ తెలియాలనే ఢిల్లీలో మహాధర్నా చేపట్టామని తెలిపారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఎప్పుడైనా పనిచేసి గెలిచారా..? ఎప్పుడూ రాముడు, హనుమంతుడు పేరు చెప్పి గెలవాలని చూస్తారని విమర్శించారు. మేము కూడా దేవుళ్లను పూజిస్తాం కానీ దేవుని పేరుతో రాజకీయం చేయం ఓట్లు- అడగమన్నారు. బీజేపీ ముస్లింల పేరు చెప్పి బీసీ రిజర్వేషన్లు అడ్డుకోవాలని చూస్తోంది. బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వడం ఇష్టం లేకనే ఇలాంటి సొల్లు కబుర్లు చెబుతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ బీసీ అని ఓట్లేయించుకున్న బండి సంజయ్.. కిషన్ రెడ్డి మాట వింటు-న్నాడని విమర్శించారు. బీసీలకు మద్దతుగా రెడ్డిలు, బ్రాహ్మణులు, ఎస్సీలు.. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చారు. కానీ తెలంగాణ బీజేపీ బీసీ నేతలకు ఎందుకు ముందుకు రావడం లేదని నిలదీశారు.

## 2025 ఆగస్టు 7, గురువారం




మాసం పక్షం
శ్రావణ మాసం (అమాంత)
శుక్లపక్షం
తిథి
త్రయోదశి - రాత్రి 8:49 వరకు
చతుర్దశి - ఆ తర్వాత ప్రారంభం
నక్షత్రం
శ్రవణం - మరునాడు ఉదయం
1:28 వరకు (8వ తేదీ వరకు)
శుభ సమయాలు
బ్రహ్మ ముహూర్తం: 4:27 - 5:13
అభిజిత్ ముహూర్తం: 12:00 - 12:52
అమృతకాలం: రా. 3:45 - 5:38 (8వ తేదీ ఉదయం వరకు)
అశుభ సమయాలు
రాహుకాలం: 1:59- 3:35
యమగండం: 6:02 - 7:38
దుర్ముహూర్తం: మధ్యాహ్నం 1:43 - 2:35
వర్జ్యం: రా. 3:45 - 5:38 (8వ తేదీ ఉదయం)

# విద్యారంగ అభివృద్ధికి అండగా లయన్స్ క్లబ్‌లు



**యాదగిరిగుట్ట, ఆగస్టు 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
యాదగిరిగుట్టలోని జెడ్‌పిఎచ్‌ఎస్ బాలుర పాఠశాలలో ఈ రోజు విద్యారంగ అభివృద్ధికి మరో అడుగు వేయిస్తూ లైబ్రరీ మరియు సైన్స్ ల్యాబ్‌ను లయన్ డా. జి. మహేంద్ర కుమార్ రెడ్డి, డిస్ట్రిక్ట్ గవర్నర్‌గా ఘనంగా ప్రారంభించారు. “లైబ్రరీలు జ్ఞాన కేంద్రాలు – సైన్స్ ల్యాబ్‌లు విద్యార్థుల పరిశోధనకు వేదికలు” అని ఆయన మాట్లాడుతూ, యువత అభివృద్ధికి ఈ సదుపాయాలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.ఒక లక్షా యాభై వేల రూపాయల వ్యయంతో లయన్ వి. బిక్షపతి విరాళంగా అందించిన ఈ శాశ్వత ప్రాజెక్టును లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్ మరియు లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంచినెల్ సంయుక్తంగా స్పాన్సర్ చేశాయి. కార్యక్రమానికి లయన్స్ ప్రాంతీయ, జోనల్ నాయకులు, వివిధ క్లబ్‌ల ప్రెసిడెంట్లు, కార్యదర్శులు, ట్రెజరర్లు హాజరై, తమ సంఘటనల నిబద్ధతను చాటిచెప్పారు.

## మాడుగులలో కాంగ్రెస్ హామీలపై బీజేపీ ధర్నా



**మాడుగుల, ఆగస్టు 6(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారెంటీలు, 420 హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేస్తోందని ఆరోపిస్తూ మాడుగుల మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో ర్యాలీ, ధర్నా నిర్వహించనున్నారు. తల్లోజు ఆచారి నేతృత్వంలో జరిగే ఈ కార్యక్రమంలో జిల్లా, రాష్ట్ర స్థాయి నేతలు పాల్గొననున్నారు.

## అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత



**దేవరకొండ,ఆగస్టు 06(నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం తాటికోల్ గ్రామం వాగు నుండి అక్రమ ఇసుక రవాణా చేస్తున్న తాటికోల్ గ్రామస్తుడూ జూలూరు అనిల్ యొక్క ట్రాక్టర్ ను సిఐ పి .వెంకట్ రెడ్డి పట్టుకొని పోలీస్ స్టేషన్ కు తరలించి అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనైనదని తెలిపారు.

# వైభవంగా చెన్నకేశవ స్వామి కళ్యాణ మహోత్సవం



**మిర్యాలగూడ, ఆగస్టు 6(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అడవిదేవులపల్లి గ్రామంలోని బౌద్ధమ గుళ్ళల్లో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ స్వామి వారి 21వ కళ్యాణ మహోత్సవాన్ని గ్రామ ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. స్వామివారి కళ్యాణం సందర్భంగా పూజారి ఎడవల్లి రఘురామయ్య శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించగా, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా గద్దర్ రెండవ వర్ధంతి సభ



**ఆమనగల్, ఆగస్టు 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
తెలంగాణ ప్రజా ఉద్యమ స్ఫూర్తి గద్దర్ రెండవ వర్ధంతి సభ నేడు ఆమనగల్‌లో కల్వకుర్తి విగ్రహ నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కన్వీనర్ లక్ష్మణ శర్మ, మెడికల్ షాప్ రాము ఆధ్వర్యంలో జరిగిన సభలో ప్రజా కవి గాయాలు గద్దర్ జీవితాన్ని, ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరాన్ని గుర్తుచేశారు.తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు వరుసలో నిలబడి పాటల ద్వారా చైతన్యం కలిగించిన గద్దర్ లేకపోవడం తెలుగు సమాజానికి తీరనిలోటని సభలో పేర్కొన్నారు. త్వరలో కల్వకుర్తి పట్టణంలో గద్దర్ విగ్రహ ఆవిష్కరణ సభను విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జక్కగోపాలు, బిక్షపతి, బొజ్జన్న, సుధాకర్, రజితక్క, సాత్రి నరసింహ, శేఖర్, సుకుమార్, రవి, యాదయ్, మిడ్జిల్ శంకర్, రామస్వామి, మేస్త్రి వెంకటయ్య, సువర్ణ, టి. రాములు తదితరులు పాల్గొన్నారు.

## జోరుగా బీజేపీ ఇంటింటి ప్రచారం





**మంచాల, ఆగస్టు 6(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మహా సంపర్క అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంచాల మండల కేంద్రంలో బీజేపీ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర నాయకులు గోగిరెడ్డి లచ్చిరెడ్డి, కౌన్సిల్ సభ్యులు వింజమూరు వెంకటరెడ్డి తదితర నేతలు పాల్గొని మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించారు.

# తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం




**దేవరకొండ, ఆగస్టు 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ముదిగొండ, ఉచిరల్లతండా, రత్యతండ అంగన్వాడి కేంద్రాల్లో గర్భిణీ బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. సూపర్వైజర్ డి. చిట్టెమ్మ మాట్లాడుతూ, బిడ్డ పుట్టిన గంటలోపే ముర్రుపాలు ఇవ్వాలని, ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలను మాత్రమే ఇవ్వాలన్నారు. బాలామృతం వినియోగంపై కూడా సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో స్కూల్ టీచర్లు భాస్కర్, మోతిలాల్, వెంకటేశ్వర్లు, మురళి, పల్లె డాక్టర్ సోనీ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ శ్రీ శ్రీ పోచమ్మ దేవాలయానికి 2 లక్షల విరాళం

### నిర్మాణానికి భూమి పూజ





**యాచారం, ఆగస్టు 06 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మాల్ గ్రామపంచాయతీ పరిధిలోని కిషన్‌పల్లి గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ పోచమ్మ తల్లి దేవాలయ మండప నిర్మాణానికి భూమి పూజ ఘనంగా నిర్వహించారు. గర్భగుడికి రంగులు వేయించేందుకు, మండప నిర్మాణానికి అయ్యే ఖర్చు కలిపి సుమారు 2 లక్షల రూపాయలవిరాళంగా అందించనున్నట్లు యాచారం మండలం కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బట్టు శ్రీనివాస్ ముదిరాజ్ ఆలయ కమిటీ సభ్యులకు గ్రామస్తుల సమక్షంలో హామీ ఇచ్చారు. ఆయన హామీ మేరకు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి.ఈ సందర్భంగా శ్రీనివాస్ ముదిరాజ్ మాట్లాడుతూ, మాల్ గ్రామపంచాయతీ పరిధిలోని అన్ని దేవాలయాలను అభివృద్ధి చేసుకోవడం మనందరి బాధ్యత అని తెలిపారు. పోచమ్మ తల్లి ఆశీస్సులతో మాల్, మార్కెట్, కిషన్‌పల్లి గ్రామ ప్రజలందరికీ శాంతి, ఐశ్వర్యం కలగాలని ఆకాంక్షించారు. అమ్మవారికి సేవ చేసుకునే అవకాశం కల్పించినందుకు కిషన్‌పల్లి గ్రామస్తులకు హృదయపూర్వక నమస్కారాలు చెప్పారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిన్నోళ్ల పద్మజ జహంగీర్, మాజీ వార్డు సభ్యులు దేరంగుల కృష్ణ, ఎర్రం సోమయ్య, ఆలంపల్లి వెంకటయ్య, జపాల కృష్ణయ్య, కంబాలపల్లి సాయిలు, పెరుమాండ్ల వెంకటయ్య, జపాల రాములు, జాపల జంగయ్య, జపాల చంద్రయ్య, జపాల సోమయ్య, అలంపల్లి యాదయ్య, ఆలంపల్లి మహేష్, జపాల నరసింహ, జపాల యాదయ్య, డొంకు జగన్, డొంకు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# షాద్ నగర్ కోర్టు కాంప్లెక్స్ లో సిసి రోడ్డు పనులకు పూజా కార్యక్రమం



**షాద్ నగర్, ఆగస్టు 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
షాద్ నగర్ కోర్టు కాంప్లెక్స్ మరింత శోభాయమానంగా మారనుంది. న్యాయవాదుల అభ్యర్థన మేరకు కోర్టు పరిసరాల్లో సిసి రోడ్డు నిర్మాణానికి మున్సిపల్ నిధులు కేటాయించడంతో ఈరోజు పూజా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీనియర్ సివిల్ జడ్జి స్వాతి రెడ్డి, జూనియర్ సివిల్ జడ్జి కొత్త రవి హాజరై నారీ కేలాలు సమర్పించి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు.షాద్ నగర్ బార్ అసోసియేషన్ సభ్యులు కోర్టు కాంప్లెక్స్ అభివృద్ధి కోసం స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను సంప్రదించగా, ఆయన వెంటనే స్పందించి తక్కువ కాలంలోనే నిధులు మంజూరు చేయించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు ఎమ్మెల్యేకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నర్వ వేణుగోపాలరావు, ప్రధాన కార్యదర్శి గుండుబావి శ్రీనివాస్ రెడ్డి, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, మహిళా న్యాయవాదులు పాల్గొని అభినందనలు తెలిపారు.అదేవిధంగా కోర్టు కాంప్లెక్స్ లో బహుళ అంతస్తు నిర్మాణానికి రూ. 8 కోట్ల రూపాయల అనుమతులు పొందేందుకు ఎమ్మెల్యే శంకర్ చేస్తున్న ప్రయత్నాలను కూడా న్యాయవాదులు ప్రశంసించారు. ఈ అభివృద్ధి కార్యక్రమాలతో కోర్టు సిబ్బంది, కక్షిదారులు, న్యాయవాదులు సమిష్టిగా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## జంతర్ మంతర్‌లో బీసీ రిజర్వేషన్లకు మహాధర్నా కి హాజరైన ఎమ్మెల్యే బీఎల్ఆర్



**న్యూఢిల్లీ, ఆగస్టు 6(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
42 శాతం రిజర్వేషన్ల అమలుకు ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో మహాధర్నా జరిగింది. మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి , నల్గొండ జిల్లా ప్రజాప్రతినిధులతో పాటు పాల్గొని బీసీ హక్కుల పక్షంలో మద్దతు తెలిపారు.

### బీసీ రిజర్వేషన్ల సాధన మహాధర్నా లో పాల్గొన్న ఎంపీ బలరాం నాయక్

**మహబూబాబాద్.,ప్రతినిధి, ఆగస్టు 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
బీసీ రిజర్వేషన్ల సాధన కోసం నేడు ఢిల్లీలో కాంగ్రెస్ మహాధర్నా జంతర్ మంతర్ వద్ద రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి,ఏఐసీసీ నాయకురాలు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మీనాక్షి నటరాజన్, తో మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్, పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్ల సాధనకు నిరంతర పోరాటం

## అడ్డగుంట శ్రీనివాస్ గౌడ్




**ఎలిగేడు, ఆగస్టు 6(నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో నిర్వహించిన మహాధర్నాలో ఎలిగేడు మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు అడ్డగుంట శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీసీల హక్కుల కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతర పోరాటం చేస్తుందని, రాబోయే రోజుల్లో రిజర్వేషన్ల సాధనకు మరింత ఉత్సాహంగా ముందుకు సాగుతామని తెలిపారు.

# ఆర్థిక భరోసాతో మనసున్న నాయకుడిగా కొత్త జైపాల్ రెడ్డి



**గంగాధర, ఆగస్టు 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
గంగాధర మండలం లక్ష్మిదేవిపల్లి గ్రామంలో ఇటీవల ఆత్మహత్యయత్నం చేసిన మాజీ సర్పంచ్ భర్త రవి కుటుంబాన్ని పరామర్శించిన మైత్రి ఛానల్ చైర్మన్ కొత్త జైపాల్ రెడ్డి మానవత్వం చాటుకున్నారు. గ్రామాభివృద్ధి కోసం అప్పులు తెచ్చి పనులు చేసినప్పటికీ బిల్లులు రానందున తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదురైన రవి కుటుంబానికి 30 వేల రూపాయల ఆర్థిక సాయం అందించి ఎల్లవేళలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా మిత్రమండలి సభ్యులు ఆయనతో కలిసి పరామర్శ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కర్ర వెంకట్ రెడ్డి భౌతిక దేహానికి నివాళులర్పించిన కేంద్ర ఖాదీ,చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం





**వర్ధన్నపేట, ఆగస్టు 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
అనారోగ్యంతో మృతి చెందిన కర్ర వెంకటరెడ్డి భౌతిక దేహానికి కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం పూలమాల వేసి నివాళులర్పించి,బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.వర్ధన్నపేట మండలం రామారం గ్రామానికి చెందిన సీనియర్ రాజకీయ నాయకులు కర్ర వెంకట్ రెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు.విషయం తెలుసుకున్న కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం మృతుడి నివాసానికి వెళ్లి వెంకట్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.ఈ సందర్భంగా కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం మాట్లాడుతూ వెంకట్ రెడ్డి కుటుంబ సభ్యులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇల్లంద గ్రామ మాజీ సర్పంచ్ పెంచికాల కుమార స్వామి, రామారం గ్రామ మాజీ సర్పంచ్ కుల్లా వెంకటయ్య, మాజీ ఎంపీటీసీ మురళి, ఉప్పరపల్లి గ్రామ నీటి తీర్వ సంఘం మాజీ చైర్మన్ కరిమిళ్ల సంపత్ రావు, మాజీ ఎంపీటీసీ భూషబోయిన సంపత్ యాదవ్, సోమిరెడ్డి, యాకయ్య , శ్రీనివాస్ రెడ్డి ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్ల కోసం ధర్నాలో పాల్గొన్న దంతోజి నరసింహ చారి



**కందుకూరు, ఆగస్టు 6(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద తెలంగాణ కాంగ్రెస్ నేతలు నిర్వహించిన మహాధర్నాలో మహేశ్వరం నియోజకవర్గం బీసీ నాయకులు పాల్గొన్నారు. కందుకూరు మండల మాజీ యూత్ ప్రెసిడెంట్ దంతోజి నరసింహ చారి మాట్లాడుతూ, రాహుల్ గాంధీ ఆదేశంతో సీఎం రేవంత్ రెడ్డి కులగణన చేపట్టి బీసీలకు రిజర్వేషన్ కోసం ఆర్డినెన్స్ తీసుకొచ్చారని తెలిపారు. కేంద్రం వెంటనే స్పందించి చట్టబద్ధంగా అమలు చేయాలన్నారు.

# తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి ఆచార్య జయశంకర్‌కు ఘన నివాళి



**రంగారెడ్డి, ఆగస్టు 6(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలంగాణ రాష్ట్ర సాధనకు తన జీవితాన్ని అంకితం చేసిన మహానేత ఆచార్య కొత్తపల్లి జయశంకర్ 91వ జయంతిని పురస్కరించుకుని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి ఘనంగా నివాళులర్పించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సమావేశ మందిరంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి, జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 1969 ఉద్యమం నుంచి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు దిక్సూచి అయిన ఆచార్య జయశంకర్ సేవలు చిరస్మరణీయమని, విద్యార్థి దశ నుంచే తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలపై పోరాటం చేశారని కొనియాడారు. ఆయన ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, కలెక్టరేట్ ఏఓ సునీల్ కుమార్, బీసీ వెల్ఫేర్ అధికారి కేషురాం, మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా మొక్కలు నాటిన ఉపాధ్యాయులు



**దేవరకొండ, ఆగస్టు 06(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
నల్గొండ జిల్లా డిండి మండలం స్థానిక తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదర్శ పాఠశాల మరియు కళాశాలలో బుధవారం నాడు ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డి. నారాయణ రెడ్డి ఆచార్య జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాలను వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమానికి తన జీవితాన్ని అంకితం చేసి, నాన్ మూల్కీ ఉద్యమంలో పాల్గొని ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతపై పలు పుస్తకాలు రచించరని అన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి చింత బిచ్చయ్య మాట్లాడుతూ, 1969లో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం పోరాటం చేశారని, ఆంధ్రప్రదేశ్ నుండి తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు విషయంలో, నీళ్ల నిధులు నియామకాలు అనే అంశాలపై శ్రీకృష్ణ కమిటీతో కలిసి పని చేశారని చివరికి తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందే మరణించారని తెలిపారు. జయశంకర్ సార్ జ్ఞాపకార్థం పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి.నారాయణరెడ్డి, జాతీయ సేవా పథకం అధికారి చింత బిచ్చయ్య, శ్యాంసుందర్, శ్రీలత, సుశీల, రమా, విజయ్ కుమార్, వెంకటేశ్వర్లు, కోదండరామారావు, చెన్నయ్య, సోమయ్య, రవి, బాలకృష్ణ, రుంషా, శ్రీను శ్రీలత, విజయ్, రమేష్, జ్యోతి,సందీప్, ధనలక్ష్మి, పిడి రవి ,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఎలిగేడు లో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు

## బిఆర్ఎస్ నేతల ఆధ్వర్యంలో ఘన నివాళులు

**ఎలిగేడు, ఆగస్టు 6(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ప్రత్యేక తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని ఎలిగేడు మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నేతలు, కార్యకర్తలు, అభిమానులు నివాళులర్పించారు.తెలంగాణ సాధనలో జయశంకర్ త్యాగం అపూర్వమని గుర్తు చేసిన నేతలు, ఆయన ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తానిపర్తి స్రవంతి మోహన్ రావు, మండల అధ్యక్షుడు బైరెడ్డి రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ముందస్తు అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

## నూనె వెంకటేశ్వర్లు



**చింతపల్లి, ఆగస్టు 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలపై రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిర్వహించనున్న ధర్నాకు ముందు, చింతపల్లి మండలంలో కార్మికులను ముందస్తుగా అరెస్టు చేయడం ప్రభుత్వ వైఖరిని ప్రశ్నించేలా మారింది. దేవరకొండలో ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, “ముందస్తు అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు” అని స్పష్టం చేశారు. 22 ఏళ్లుగా విద్యార్థులకు ఆరోగ్యకరమైన భోజనం అందిస్తున్న కార్మికులకు కనీస వేతనం లేకుండా గౌరవ వేతనం పేరిట చాకిరి చేయిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వంట బిల్లులు నెలలుగా పెండింగ్‌లో ఉండగా, జీతాలు ఆలస్యం కావడం వల్ల కుటుంబాలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నాయని తెలిపారు. వంట సమయంలో పొగ వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని, ప్రభుత్వం తక్షణమే గ్యాస్ సిలిండర్లు, వంట పాత్రలు, కోడిగుడ్ల సరఫరా, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కార్డులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల సహాయ కార్యదర్శి ఎండి జావీద్, సంఘం అధ్యక్షులు, కార్యదర్శులు మామిడి సాలమ్మ, ఎర్రమళ్ళ వెంకటమ్మ, బాజపల్లి వెంకటయ్య, మనెమ్మ, జుబేదా, సలేహ, గౌసియా, కౌసల్య తదితరులు పాల్గొన్నారు.

# పంబ కళపై పరిశోధనకు హెచ్‌సీయూ వీసీ ప్రశంసలు

## పర్వతాలుకు విశేష గౌరవం



**దేవరకొండ, ఆగస్టు 6(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నల్లగొండ జిల్లా తిమ్మాపురం గ్రామానికి చెందిన పంబాల పర్వతాలు పంబ కళపై చేసిన లోతైన పరిశోధనకు హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం నుంచి విశేష అభినందనలు లభించాయి. పంబాల సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక స్థితిగతులను విశ్లేషిస్తూ, పేదరిక నిర్మూలన, ఆహార భద్రత, విద్యా అవకాశాలపై నూతన కోణాన్ని ప్రతిపాదించిన ఈ అధ్యయనం, సంప్రదాయ కళల పరిరక్షణకు మార్గదర్శిగా నిలుస్తుందని విద్యావేత్తలు అభిప్రాయపడ్డారు.ఈ పరిశోధనను పరిశీలించిన అనంతరం హెచ్‌సీయూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ బి. జె. రావు “ఇది ప్రజల జీవనవిధానాన్ని అభివృద్ధి లక్ష్యాల దృష్టిలో నిలుపుతూ చేసిన అరుదైన ప్రయత్నం” అని ప్రశంసించారు.తెలుగు శాఖాధ్యక్షులు ప్రొఫెసర్ పిల్లలమర్రి రాములు, పరిశోధన పర్యవేక్షకులు డా. దార్ల వెంకటేశ్వరరావు కూడా ఈ అధ్యయనాన్ని సమాజ చైతన్యానికి ప్రేరణగా అభివర్ణించారు.

# మహేశ్వరం మండలంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం



**మహేశ్వరం, ఆగస్టు 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మహేశ్వరం మండల కేంద్రంలోని ఫ్యాబ్సిటీ సబ్ స్టేషన్‌లో మరమ్మత్తుల కారణంగా గురువారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుంది. ఈ మేరకు ఏఈ చక్రపాణి తెలిపారు. ఇమామ్ గూడ, ప్రజయ్ విల్లాస్, మంఖల్, హర్షగూడ, శ్రీనగర్ ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేత ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# హరీశ్‌రావు ప్రజంటేషన్ అద్భుతం

కాంగ్రెస్‌పై గంగుల కమలాకర్ విమర్శలు





**కరీంనగర్, ఆగస్టు 6(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి హరిశ్‌రావు చేసిన పవర్‌పాయింట్ ప్రజంటేషన్ అద్భుతంగా ఉందని, అది రాష్ట్ర ప్రజల కళ్లు తెరిపించిందని కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పేర్కొన్నారు. కాళేశ్వరం కమిషన్ నివేదికపై హరిశ్‌రావు ఆధారాలతో కూడిన బ్రీఫింగ్ ఇచ్చారని, అసెంబ్లీ వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని చీల్చి చెండాడతారని హెచ్చరించారు. కేంద్రమే కాళేశ్వరానికి అనుమతులు ఇచ్చిందని గుర్తుచేస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వం 650 పేజీల నివేదికలో నచ్చిన పేర్లను మాత్రమే లీక్ చేస్తోందని, నచ్చని నేతలను బద్నాం చేస్తోందని విమర్శించారు. కేసీఆర్‌ను లక్ష్యంగా చేసుకుని కుట్రలు చేస్తున్నారని, ఆయనే తెలంగాణ రైతులకు సాగునీరు అందించిన మహానుభావుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, బండ శ్రీనివాస్, చల్ల హరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# యాదాద్రి భువనగిరి జిల్లా చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ గా ఎం.ఆర్ వెంకటరమణ



**యాదాద్రి,ఆగస్టు 06 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

యాదాద్రి భువనగిరి జిల్లా నూతన చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ గా ఎం ఆర్ వెంకటరమణ బదిలీపై వచ్చారు. సోమవారం ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించగా, బుధవారం నీలగిరి ఎక్స్ ప్రెస్ తో మాట్లాడారు. గతంలో ఆయన డి ఈ ఎస్ హైదరాబాదులో డిప్యూటీ డైరెక్టర్ గా పనిచేసి ట్రాన్స్ఫర్ పై యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఓగా రావడం జరిగిందని తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా లో ప్రణాళిక బద్ధంగా పనిచేస్తూ యాదాద్రి భువనగిరి జిల్లా అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించనున్నట్లు తెలిపారు.



పూలమాలలు వేసి నివాళులర్పించి, కొనియాడిన బిఆర్ఎస్ నాయకులు

# అభాగ్యుల కోసం ప్రత్యేక డ్రైవ్



**కరీంనగర్, ఆగస్టు 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

నగరంలోని ప్రధాన కూడళ్ల వద్ద నివసిస్తున్న అనాథలు, మతిస్థిమితం లేని వారిని గుర్తించేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. వారిని తాత్కాలికంగా వసతి కల్పించి, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి అప్పగించాలని సూచించారు. అవసరమైతే వారిని హైదరాబాద్ ఎన్జీవోలకు అప్పగించనున్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. సమావేశంలో ఏసీపీ సతీష్, సీఐ రవీందర్, మెప్మా పీడీ వేణుమాధవ్ రెడ్డి, వీబీ ఫౌండేషన్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# రామాలయం గుడి నుండి తప్పుకుంటాం

గుడి పరిరక్షనే మా ధ్యేయం.



**మెదక్ జిల్లా-,ఆగస్టు 06 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

శ్రీ కోదండ రామాలయ పరిరక్షణ కోసం బాధ్యతల నుంచి తప్పుకునేందుకు మేము సిద్ధం గా ఉన్నామని రామాలయ కమిటీ చైర్మన్ బండ నరేందర్ స్పష్టం తెలియజేశారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలు, భక్తులు, దాతల సహకారంతో ఆలయ అభివృద్ధికి కమిటీ కృషి చేసిందన్నారు. ఆగమశాస్త్రాల ప్రకారం ఎలాంటి లోటు పాట్లు లేకుండా నిత్య పూజలు నిర్వహించామన్నారు. ఆలయానికి సంబంధించిన ప్రతి పైసా లెక్క రాసి ఉందని, ఇందులో ఎలాంటి సందేహం అవసరం లేదన్నారు. ఎవరూ ఎప్పుడు లెక్కలు అడిగినా చూపించేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. కమిటీకి భక్తులు, అన్ని రాజకీయ పార్టీలు సమానమేనని, కొందరు తమపై తప్పుడు ప్రచారం చేశారన్నారు. దయచేసి రామాలయాన్ని ఎండోమెంట్ నుంచి కాపాడాలని రాజకీయ పార్టీలతోపాటు స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు, ఎంపి రఘు నందన్ రావుకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఆలయ అర్చకులు భాష్యం మధుసూదనాచార్యులు, వేద పండితులు కృష్ణమూర్తి, కమిటీ సభ్యులు, మల్లేశం, పురుషోత్తం, శ్రీనివాస్, బద్రినాథ్ ,బాలరాజ్, తదితరులు పాల్గొన్నారు




# స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి

బిజేపిజిల్లా ఉపాధ్యక్షుడు వానం నరేందర్ రెడ్డి.

**దేవరకొండ, ఆగస్టు 06(నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు వానం నరేందర్ రెడ్డి బుధవారం నాడు ఒక ప్రకటన విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల పాలన ముగిసి18 నెలల గడిచినప్పటికీ కూడా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకుండా కాలయాపన చేస్తూ కుంటి సాకులు చెబుతూ కాలం వెళ్లదీస్తుందన్నారు. గ్రామాలలో ప్రజలకు కనీస వసతులు ఈ ప్రభుత్వం కల్పించలేకపోతుందని, స్థానిక సంస్థల ఎన్నికలు జరపకుండా గ్రామాలలో పాలన అధికారం ప్రత్యేక అధికారులకు గ్రామ కార్యదర్శులకు ఇచ్చి వారికి నిధులు కేటాయించకుండా గ్రామాలలో కనీస వసతులు కల్పించమని అంటే నిధుల లేని కారణంగా వాళ్ళు కనీస వసతులుకల్పించలేకపోతున్నారు.



గ్రామాల్లో విరివిగా కంపచెట్లు పెరిగిన కారణంగా పరిశుభ్రత లోపించడం, వీధిలైట్లు వెలగకపోవటం, మంచినీటి సౌకర్యాలు కల్పించలేకపోవడం, వీధి కుక్కలతో ఇబ్బంది,కోతులతో, దోమలతో బెడద ఈ రకంగా అనేక సమస్యలు గ్రామాల్లో తిష్ట వేశాయి. రాష్ట్రంలో ప్రజలు ఇన్ని సమస్యలు ఎదుర్కొంటుంటే ఈ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తూ ప్రజలను అనేక సమస్యలకు గురిచేస్తుందని తెలిపారు. ఎన్నికలు నిర్వహించనందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చేటటువంటి 2024-25 ఆర్థిక సంవత్సరంలో మన రాష్ట్రానికి కేటాయించిన15వ ఆర్థిక సంఘం నుండి రావాల్సినటువంటి 1517 కోట్లు వెనక్కి వెళ్లడం జరిగిందని,ప్రభుత్వం వెంటనే స్థానిక సంస్థల ఎలక్షన్లు నిర్వహించకపోయినట్లయితే 2025 -26 కు సంబంధించినటువంటి 15వ ఆర్థిక సంఘం నిధులు 1477 కోట్లు కూడా వెనక్కి వెళ్లే ప్రమాదం ఉందని తెలియజేశారు. కావున ప్రభుత్వం వెంటనే స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహించి తెలంగాణ ప్రజల ప్రయోజనాలు కాపాడాలని కోరారు.

# తెలంగాణ ఉద్యమానికి జీవితం అంకితం చేసిన గొప్ప వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్



**యాదాద్రి,ఆగస్టు 06 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

తెలంగాణ ఉద్యమానికి తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్ అని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు అన్నారు. బుధవారం రోజు కలెక్టరేట్ సమావేశ మందిరంలో తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్ 91 వ జయంతి పురస్కరించకుని వారి చిత్ర పటానికి జిల్లా కలెక్టర్, రెవిన్యూ అదనపు కలెక్టర్ వీరా రెడ్డి, స్థానిక సంస్థ ల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లడుతూ జీవితమంతా తెలంగాణ ఉద్యమానికి, స్వరాష్ట్ర ఏర్పాటుకు అంకితం చేసిన గొప్ప వ్యక్తి ఆచార్య జయశంకర్ అని , వారి సేవలు చిరస్మరణీయమని కలెక్టర్ అన్నారు. తెలంగాణ ఆశ, శ్వాసగా జీవించి ఉద్యమానికి దిక్సూచిగా నిలిచారని కొనియాడారు. తెలంగాణ తొలి దశ ఉద్యమంలో పోరాడి మలి దశ ఉద్యమంలో స్వరాష్ట్ర సాధనకు ఆచార్య జయశంకర్ మార్గదర్శనం గా నిలిచారన్నారు. ఆచార్య జయశంకర్ మన మధ్య లేనప్పటికీ.. అందరి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని వెల్లడించారు. ఆచార్యుని ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణా రెడ్డి, ఏవోజగన్మోహన్ ప్రసాద్ ,బీసీ సంక్షేమ అధికారి సాహితి , యస్. సి కార్పొరేషన్ ఈ డి శ్యామ్ సుందర్, బీసీ సంఘం నాయకులు,కలెక్టరేట్ పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా మారం జగదీశ్వర్ జన్మదిన వేడుకలు

ఉద్యోగుల సమస్యలపై ఉద్యమానికి హెచ్చరిక




**హైదరాబాద్, ఆగస్టు 6(నీలగిరి ఎక్స్ ప్రెస్):**

టి.ఎన్.జి.ఓ.ల. రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ జన్మదిన వేడుకలు నాంపల్లి టి.ఎన్.జి.ఓ.ల. భవన్‌లో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుస్సేన్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉద్యోగుల సమస్యలపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.“ఆగస్టు 15 నాటికి పెండింగ్ బిల్లులు, హెల్త్ స్కీమ్‌పై నిర్ణయం తీసుకోకపోతే ఉద్యమ కార్యాచరణ చేపడతాం,” అని హెచ్చరించారు. జిపిఎఫ్ లోన్లు, పదవీవిరమణ లాభాలు రాక ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.కరీంనగర్ జిల్లా ఎంప్లాయిస్ యూనియన్ తరఫున ఘన సన్మానం నిర్వహించగా, సర్దార్ హర్మేందర్ సింగ్ మెమెంటో బహుకరించారు. కార్యక్రమంలో దారం శ్రీనివాస్ రెడ్డి, సంగం లక్ష్మణరావు, ముప్పిడి కిరణ్ కుమార్ రెడ్డి, కోటా రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు

# పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలి

### కలెక్టర్ హనుమంత రావు



**యాదాద్రి,ఆగస్టు 06 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు అధికారులను ఆదేశించారు. బుధవారం రోజు మినీ మీటింగ్ హాల్ లో అన్ని శాఖల అధికారులతో స్వాతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్,రెవిన్యూ అదనపు కలెక్టర్ వీరా రెడ్డి,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు తో కలసి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాల నిర్వహణ ఏర్పాట్ల పైవివిధ శాఖ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి సమీక్షించారు. ఆయా శాఖల వారీగా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా వేడుకలు సజావుగా జరిగేలా ఆయా శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వేడుకలు నిర్వహించనున్నందున అందుకనుగుణంగా వేదిక, వి ఐపిలు, అధికారులకు, ఇతరులకు అనుకూలంగా సీటింగ్ ఏర్పాట్లను పక్కాగా ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి , హ్యాండ్లూమ్, మత్స్యశాఖ, హార్టికల్చర్, మెప్మా, వైద్య, శిశు సంక్షేమ, సంక్షేమ శాఖలు స్టాల్స్ ఏర్పాటు చేయాలని, మరియు జిల్లా గ్రామీణాభివృద్ధి, హార్టికల్చర్ అగ్రికల్చర్, అటవీ, విద్య, ఆర్టీసీ సివిల్ సప్లై ఎలక్ట్రిసిటీ హౌసింగ్ శాఖలు శకటాల ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రతిబింబించేలా స్టాల్స్, శకటాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రొటోకాల్ ను అనుసరిస్తూ అతిథులకు ఆహ్వానాలు పంపాలని సూచించారు. జాతీయ భావన పెంపొందేలా విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని అన్నారు. అన్ని శాఖల అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహిస్తూ, వేడుకలు విజయవంతం అయ్యేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ ,భువనగిరి ఆర్డీఓ కృష్ణా రెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ రామలింగం, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## ఆచార్య జయశంకర్ జయంతి సందర్భంగా ఘన నివాళి

-పాల్గొన్న కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు



**కరీంనగర్, ఆగస్టు 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ రాష్ట్ర సిద్ధాంతకర్త ఆచార్య ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని పురస్కరించుకొని కరీంనగర్ పట్టణంలోని మదీనా చౌక్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, బీఆర్ఎస్ పార్టీ నగర అధ్యక్షులు చల్ల హరిశంకర్, మాజీ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.ఆచార్య జయశంకర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని తెలంగాణ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నేతలు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

## సీపీఐ రాష్ట్ర మహాసభల విజయానికి పిలుపు

-మహేశ్వరం మండల కేంద్రంలో గోడ పత్రిక విడుదల



**మహేశ్వరం, ఆగస్టు 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ రాష్ట్ర 4వ సీపీఐ మహాసభలు ఈ నెల 19 నుంచి 22 వరకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో నిర్వహించనున్న నేపథ్యంలో మహేశ్వరం మండల కేంద్రంలో సీపీఐ మండల కార్యదర్శి పి. దేవేందర్ గౌడ్ ఆధ్వర్యంలో గోడ పత్రికను విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర మహాసభలు ప్రజలు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించేందుకు, భవిష్యత్ పోరాటాలకు కార్యాచరణ రూపొందించేందుకు వేదికగా నిలుస్తాయని తెలిపారు. ప్రజా సమస్యలపై పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధంగా ఉండాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్నాటి యాదయ్య, మండల సహాయ కార్యదర్శి బ్రాహ్మాచారి, మహేశ్వరం గ్రామ శాఖ కార్యదర్శి ఆర్. రమేష్, కందుకూరు మండల సహాయ కార్యదర్శి రామచంద్రయ్య, పులిమక్త గ్రామ కార్యదర్శి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక

తిప్పర్తి మోడల్ స్కూల్‌లో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి ఘనంగా నిర్వహణ



**తిప్పర్తి, ఆగస్టు 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్ని అంకితం చేసిన ఆచార్య ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతిని తిప్పర్తి మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎ. అపర్ణ మాట్లాడుతూ జయశంకర్ కేవలం భౌగోళిక తెలంగాణ కోసం మాత్రమే కాక, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక విముక్తి కోసం పోరాడిన మహానుభావుడని పేర్కొన్నారు. "తెలంగాణ ప్రజల ఆత్మగౌరవమే ఆయన పోరాటానికి మూలం. నీళ్లు, నిధులు, నియామకాల కోసం ప్రజల హృదయాల్లో నినాదాన్ని నింపిన వ్యక్తి" అని ఆమె కొనియాడారు.కార్యక్రమంలో ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని జయశంకర్ ఆశయాలను స్మరించుకున్నారు.

## అల్ఫోర్స్ హై స్కూల్‌లో టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ ప్రారంభం



**కరీంనగర్, ఆగస్టు 6(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
కొత్తపల్లిలోని అల్ఫోర్స్ హై స్కూల్ లో క్లస్టర్-7 బాలికల టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ ఘనంగా ప్రారంభమైంది. జ్యోతి వెలిగించి, పూజా కార్యక్రమాలతో ప్రారంభించిన ఈ వేడుకకు తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, అడ్మిన్ డీసీపీ వెంకటరమణ, అల్ఫోర్స్ అధినేత డా. నరేందర్ రెడ్డి తదితరులు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు.విద్యార్థులు క్రీడల్లో కృషి చేసి విజయం సాధించాలని, పరాజయాన్ని అధిగమించి లక్ష్యాలను చేరుకోవాలని నేతలు సూచించారు. దీప మాలిక్ వంటి అథ్లెట్లను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ టోర్నమెంట్‌లో తెలంగాణ, ఏపీ రాష్ట్రాల 35 పాఠశాలల నుండి 2500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, గౌరవ వందనం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

## ఘనంగా ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి


జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో

**నల్లగొండ,ఆగస్టు 6 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
నల్లగొండ జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ ప్రొఫెసర్ జయశంకర్ ఆగస్టు 6 ,1934 జూన్ 21న హనుమకొండ జిల్లా ,ఆత్మకూరు మండలం ,అక్కంపేటలో జన్మించారని తెలుగు ,ఉర్దూ, ఇంగ్లీష్ భాషల్లో మంచి ప్రావీణ్యం ఉన్న జయశంకర్ తెలంగాణ ఉద్యమానికి తన జీవితం అంకితం చేశారని 1969 తెలంగాణ ఉద్యమంలో అంతకుముందు సాంబార్ ఇడ్లీ గో బ్యాక్ ,ముల్కీ ఉద్యమంలో పాల్గొన్నారనీ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకత పై ఆయన పుస్తకాలు రాశాడని తెలంగాణలోనే కాకుండా దేశ విదేశాల్లో రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతను తెలిపారని ఓ తెలంగాణ దేఖ్ నా ఔర్ మర్జానా అనే వాడని తెలంగాణ ఉద్యమాన్ని ఢిల్లీ దాకా ఢిల్లీ నుండి అమెరికా దాకా వ్యాప్తి చేసిన వ్యక్తి అని విద్యార్థి దశ నుండే తెలంగాణ కు జరుగుతున్న అన్యాయాల పట్ల అసమానతల పట్ల పోరాడిన వ్యక్తి అని కొనియాడారు ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆఫీజ్ ఖాన్ ,కార్యదర్శి బాలయ్య యాదగిరిరెడ్డి, అలెగ్జాండర్ , మమ్మద్ ఖాన్ ,పున్న అంజయ గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## "అక్రమ అరెస్టులతో ఉద్యమాలను అణచలేరు"

సీఐటీయూ నేత భీమగాని గణేష్ పిలుపు



**నల్లగొండ, ఆగస్టు 6(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
మధ్యాహ్న భోజన కార్మికుల చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్లే వారిని ముందుగా అరెస్టు చేయడం అప్రజాస్వామికమని సిఐటియు తిప్పర్తి మండల కన్వీనర్ భీమగాని గణేష్ మండిపడ్డారు. వేతనాలు, బిల్లులు విడుదల, గ్యాస్ సరఫరా, పదివేల వేతనం అమలు తదితర డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాల్సిన అవసరముందన్నారు.అరెస్టుల్లో కిన్నెర సైదమ్మ, యాదమ్మ, రేణుక తదితరులు ఉన్నారు.

## బెల్ట్ షాపులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ నేత అంగిడి కుమార్ హెచ్చరిక




**జమ్మికుంట, ఆగస్టు 6(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
జమ్మికుంట, ఇల్లంతకుంట, వీణవంక మండలాల్లో వైన్ షాపుల నుంచి బెల్ట్ షాపులకు మద్యం సరఫరా అవుతోందని, ఎక్సైజ్ శాఖ తక్షణమే చర్యలు తీసుకోవాలని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా), పీడీఎస్‌యూ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు అంగిడి కుమార్ డిమాండ్ చేశారు.బుధవారం ఎక్సైజ్ సీఐకి వినతిపత్రం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ%ొ% బెల్ట్ షాపుల్లో అధిక ధరలకు మద్యం విక్రయంతో పాటు నాణ్యతలేని ఆహారం విక్రయించడం ప్రజల ఆరోగ్యానికి హానికరమని ఆవేదన వ్యక్తం చేశారు. బెల్ట్ షాపులకు మద్యం సరఫరా చేస్తున్న వైన్ షాపుల లైసెన్సులు రద్దు చేయాలని, ప్రభుత్వం కఠినంగా వ్యవహరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ చేతుల మీదుగా పంపిణీ



**కరీంనగర్, ఆగస్టు 6(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
నియోజకవర్గంలోని 168 మంది లబ్ధిదారులకు రూ.37.86 లక్షల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షులు చల్ల హరిశంకర్, మాజీ మున్సిపల్ చైర్మన్ రుద్రరాజు, మాజీ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## పేదోడి కలను నెరవేర్చిన కాంగ్రెస్ ప్రభుత్వం

**అచ్చంపేట, ఆగస్టు 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పేదవాడి కలను సాకారం చేయాలన్న సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇల్లు పథకం అచ్చంపేట పట్టణంలో కార్యరూపం దాల్చుతోంది. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ఆదేశాల మేరకు పురపాలక చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు 12వ వార్డులో అర్హులైన పేద



కుటుంబాలను గుర్తించి ఇళ్లను కేటాయించేందుకు చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో వార్డు కో-ఆప్షన్ సభ్యురాలు షమీం, ఐఎన్టీయూసీ తాలూకా అధ్యక్షులు మహబూబ్ అలీ, యూత్ కాంగ్రెస్ నేతలు ఆరిఫ్, శేఖర్, శ్రీనివాస్, సుశీల, డ్రైవర్ శ్రీను, సీనియర్ నాయకులు రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ఎండి నోటీసులపై బీజేపీ నేత సునీల్ రావు ఆగ్రహం

## పేదలపై చర్యలు మానుకోవాలని హెచ్చరిక



**కరీంనగర్, ఆగస్టు 6(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
లోయర్ మానేరు డ్యాం పరిధిలోని బతుకమ్మ, హస్నాపూర్, పెద్దమ్మ కాలనీలకు ఎల్ఎండి అధికారులు నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో బీజేపీ నేత, మాజీ మేయర్ వై. సునీల్ రావు బాధితులను పరామర్శించారు. “30 మీటర్ల పరిధి దాటి నోటీసులు ఇవ్వడం చట్టవిరుద్ధం. ప్రభుత్వ కట్టడాలకు నోటీసులు ఇవ్వకుండా పేదలపై దాడి చేయడం అన్యాయం” అని ఆయన మండిపడ్డారు. ఈ సమస్యను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. “నోటీసులు ఉపసంహరించకపోతే బీజేపీ తరఫున ఆందోళన చేపడతాం” అని హెచ్చరించారు. ప్రభుత్వ కార్యాలయాలు, వాటర్ ట్యాంకులు, ఐటీ టవర్, కేంద్ర విద్యాలయం వంటి నిర్మాణాలపై చర్యలు లేకపోవడాన్ని ఆయన ప్రశ్నించారు.

# వీర్నపల్లిలో మోడీ గిఫ్ట్ సైకిళ్ల పంపిణీ

## పదవ తరగతి విద్యార్థులకు బహుమతిగా 36 సైకిళ్లు



**రాజన్న సిరిసిల్ల, ఆగస్టు 6(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
వీర్నపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సి.ఎస్.ఆర్ నిధులతో అందజేసిన “మోడీ గిఫ్ట్” సైకిళ్లను బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి పంపిణీ చేశారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి బహుమతిగా పొందాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎమ్మార్వో ముక్తార్ పాషా, ఎంఈవో శ్రీనివాస్, ఎస్ఐ వేముల లక్ష్మణ్, బీజేవైఎం నేతలు, స్కూల్ కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితం అంకితం చేసిన మహనీయుడు జయశంకర్

## మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి



**వనపర్తి,ఆగస్టు 6 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితం అంకితం చేసిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ 94వ జయంతి సందర్భంగా బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి జయశంకర్ విగ్రహానికి పూలమాలలతో నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ,
“నాటి విద్యార్థిగా ముల్కీ ఉద్యమంలో పాల్గొన్న జయశంకర్ సార్, 1969 ఉద్యమంలో ఉద్యమపంతులుగా చలించిపోని పట్టుదలతో మూడు దశాబ్దాల పాటు తెలంగాణ రాష్ట్ర ఆవశ్యకతను ప్రజలలో సజీవంగా ఉంచారు. ఆయన నిస్వార్థ, నిరాడంబర జీవితశైలి ఎంతో ఆదర్శప్రాయంగా నిలిచింది. మలిదశ తెలంగాణ ఉద్యమానికి సిద్ధాంతిక ఆధారంగా ఊపిరిలూదిన ఆచార్య జయశంకర్ తెలంగాణ జ్ఞానశిఖరంగా మారారు,” అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి తో పాటుగట్టు యాదవ్, వాకిటి శ్రీధర్, రమేష్ గౌడ్, పరంజ్యోతి, గులాం ఖాదర్, రఘువర్ధన్ రెడ్డి, జాత్రు నాయక్, మాధవ రెడ్డి, నాగన్న యాదవ్, ఉంగ్లం తిరుమల్, రహీం, ఇమ్రాన్, నీల స్వామి, చిట్యాల రాము, జోహేబ్ హుస్సేన్, మురళి సాగర్, పెద్దముక్కుల రవి, ఏకే పాష, చిలుక సత్యం సాగర్, బాల్ రాజు, హరి బ్రదర్స్, గాలిగల్ల క్రాంతి, ఖాదర్, ఎండి మహబూబ్, నాగరాజు, ముని కుమార్, మోహన్ చారి, శివ గౌడ్, లక్ష్మణ్ గౌడ్, లోకాజి రావు, నరేష్, చందు నాయక్, తోట శీను, వెంకటయ్య, నరసింహ, చాణిక్య, ప్రసాద్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# “ప్రొటోకాల్ పాఠాలు చెప్పే అర్హత సబితాకేనా?”

## కప్పాటి పాండురంగారెడ్డి తీవ్ర విమర్శలు



**కందుకూర్, ఆగస్టు 6(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ప్రొటోకాల్ పాటించలేదంటూ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేత కప్పాటి పాండురంగారెడ్డి మండిపడ్డారు. “2018లో కాంగ్రెస్ పార్టీ తరఫున గెలిచి, తర్వాత బీఆర్ఎస్‌లో చేరిన వ్యక్తి సబితానే కాదా?” అంటూ ప్రశ్నించారు. ‘మీ పాలనలోనే ప్రభుత్వ కార్యక్రమాలను పార్టీ వేడుకలుగా మార్చిన చరిత్ర ఉంది. మీరుపేట, జిల్లెలగూడ చెరువుల ట్రంక్ లైన్ శంకుస్థాపన కార్యక్రమంలో అధికార హోదా లేని మీ కుమారుడు స్టేజీపై ఎలా కూర్చున్నాడు?” అని నిలదీశారు. ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌ను పార్టీ కార్యాలయంలా ఉపయోగించడం, ఇతర పార్టీల నేతలకు ప్రవేశం లేకుండా చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని విమర్శించారు. “ఇప్పుడు ప్రొటోకాల్ పాటించలేదని ఆరోపించడం ప్రజలను మోసం చేయడమే. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు” అంటూ హితవు పలికారు.

# సుష్మా స్వరాజ్ వర్ధంతి సందర్భంగా ఘన నివాళి

## సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజి రెడ్డి నేతృత్వంలో కార్యక్రమం



**రామచంద్రపురం, ఆగస్టు 6(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
తెలంగాణ చిన్నమ్మగా ప్రజల గుండెల్లో నిలిచిన కేంద్ర మాజీ మంత్రి శ్రీమతి సుష్మా స్వరాజ్ వర్ధంతి సందర్భంగా సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజి రెడ్డి ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. “ఆమె మన మధ్య లేకున్నా, తెలంగాణ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారు” అని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు వెంకట నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి కోల్కూర్ రాజశేఖర్ రెడ్డి, నందా రెడ్డి, లక్ష్మణ్ గౌడ్, రాజేశ్వరి మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# కట్ట మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

## అమీన్‌పూర్ సిద్ధార్థ ఎన్ క్లేవ్‌లో నిర్వహణ



**సంగారెడ్డి, ఆగస్టు 6(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
పటాన్‌చెరు నియోజకవర్గం అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని సిద్ధార్థ ఎన్ క్లేవ్ కాలనీలో శ్రీ శ్రీ కట్ట మైసమ్మ విగ్రహ ప్రతిష్ట మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజి రెడ్డి, మున్సిపల్ అధ్యక్షులు ఈర్ల రాజు ముదిరాజ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గతంలో చిన్న గుడిగా ఉన్న ఈ ఆలయాన్ని మత్స్యకారుల భక్తితో ప్రారంభించి, ఎన్నో అడ్డంకులను అధిగమించి విస్తరించినట్లు ఈర్ల రాజు తెలిపారు. కాలనీవాసులు, అసోసియేషన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ వేడుకలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి, బీజేపీ నేతలు, అసోసియేషన్ ప్రతినిధులు, కాలనీవాసులు పాల్గొని అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.

# రావిర్యాల చెరువు సుందరీకరణ పనులను పర్యవేక్షించిన మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



**మహేశ్వరం ఆగస్టు 6 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న రావిర్యాల చెరువు కట్టపై జరుగుతున్న సుందరీకరణ పనులను మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే శ్రీమతి సబితా ఇంద్రారెడ్డి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడుతూ ∩ “పనుల నాణ్యతపై ఎటువంటి రాజీ లేకుండా, వేగంగా పనులను పూర్తి చేసి చెరువును ప్రజలకు అందుబాటులోకి తేవాలి. ఈ అభివృద్ధి కార్యక్రమాలు భావితరాలకు గుర్తుండిపోయే విధంగా ఉండాలి,” అని ఆదేశాలు జారీ చేశారు. ఈ పర్యటనలో సంబంధిత శాఖల అధికారులు, నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ బోనాల ఉత్సవాల ఏర్పాట్లను సమీక్షించిన మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



**మహేశ్వరం,ఆగస్టు 6 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని రావిరియాల గ్రామంలో జరుగుతున్న శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ బోనాల ఉత్సవాల నేపథ్యంలో ఏర్పాటు చేసిన ఏర్పాట్లను మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే శ్రీమతి సబితా ఇంద్రారెడ్డి వ్యక్తిగతంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ “బోనాల సందర్భంగా వేలాదిగా వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జల, విద్యుత్, రవాణా, శుభ్రత, ఇతర మౌలిక సదుపాయాలు సమర్థంగా అందుబాటులో ఉండేలా అధికార యంత్రాంగం పని చేయాలి,” అని స్పష్టం చేశారు. ఈ సమీక్ష కార్యక్రమంలో పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ కుటిల రాజకీయాలు చేస్తోంది

## -బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి విమర్శలు



**కరీంనగర్, ఆగస్టు 6(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అంశంపై కాంగ్రెస్ పార్టీ ప్లేట్ ఫిరాయించిందని, మత ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించి బీసీ సమాజానికి ద్రోహం చేస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ఆరోపించారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో హామీ ఇచ్చిన కాంగ్రెస్, అధికారంలోకి వచ్చాక బీసీలను మోసం చేసిందని విమర్శించారు. బీజేపీ “హర్ ఘర్ బిజెపి” కార్యక్రమంపై సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలన్న బిల్లుకు అసెంబ్లీలో బీజేపీ మద్దతు తెలిపిందని, కానీ మత ప్రాతిపదికన రిజర్వేషన్లకు వ్యతిరేకమని స్పష్టంగా తెలిపిందన్నారు. ముస్లింలను బీసీల్లో కలపడం రాజ్యాంగ విరుద్ధమని అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో మాజీ మేయర్ సునీల్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుగ్గిల్లపు రమేష్, మేకల ప్రభాకర్ యాదవ్, బోయిన్పల్లి ప్రవీణ్ రావు తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్‌లో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్

## 25 వాహనాలు స్వాధీనం

**కరీంనగర్, ఆగస్టు 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గాయత్రి నగర్, లక్ష్మీనగర్ ప్రాంతాల్లో ఈరోజు భారీ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఆదేశాల మేరకు ఈ తనిఖీలు చేపట్టినట్లు అడిషనల్ డీసీపీ వెంకటరమణ తెలిపారు. మొత్తం 87 వాహనాలను తనిఖీ చేయగా, ధ్రువపత్రాలు లేని 25 వాహనాలు (24 బైకులు, ఒక కారు) స్వాధీనం చేసుకున్నారు. నంబర్ ప్లేట్ల లోపాలు, నిబంధనల ఉల్లంఘనల కారణంగా 27 వాహనాలకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా పోలీసులు ప్రజలకు సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల వినియోగం, షీ టీమ్ సేవలు, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. షీ టీమ్ ఇన్‌స్పెక్టర్ శ్రీలత





మహిళలకు భద్రతపై సూచనలు ఇచ్చారు. కమిషనర్ గౌస్ ఆలం చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఏసీపీ వెంకటస్వామి, ఇన్స్పెక్టర్లు కోటేశ్వర్, సృజన్ రెడ్డి, శ్రీలత, ఇతర అధికారులు, 150 మంది పోలీసు సిబ్బంది, 300 మంది స్థానికులు పాల్గొన్నారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతిజ్ఞ చేశారు.

# విద్యార్థులకు జీవన నైపుణ్యాలు అవసరం

## కేజీబీవీలకు కుట్టు మిషన్ల పంపిణీ
## -కలెక్టర్ పమేలా సత్పతి





**కరీంనగర్, ఆగస్టు 6(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు జీవన నైపుణ్యాలు నేర్పించాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. సప్తగిరి కాలనీ కేజీబీవీలో జరిగిన కార్యక్రమంలో 14 కస్తూరిబా బాలికల పాఠశాలలకు 2 చొప్పున కుట్టు మిషన్లు, 11 మోడల్ స్కూల్ హాస్టళ్లకు రిఫ్రిజిరేటర్లు, దోమల నియంత్రణ పరికరాలు పంపిణీ చేశారు. కుట్టు శిక్షణ కోసం ఇన్‌స్ట్రక్టర్లను నియమించినట్లు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని నైపుణ్యవంతులుగా ఎదగాలని సూచించారు. స్టోరూమ్, వంటగది పరిశీలన సందర్భంగా సిబ్బందికి సూచనలు ఇచ్చారు. "విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు" అని హెచ్చరించారు. అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ, విద్యాధికారి చైతన్య జైనీ, బాలికల అభివృద్ధి అధికారి కృపారాణి తదితరులు పాల్గొన్నారు.

# కాలనీలకు డ్యామ్ నోటీసులు

## ఎమ్మెల్యే గంగుల ఆగ్రహం



**కరీంనగర్, ఆగస్టు 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పట్టణంలోని 13వ డివిజన్‌లోని అస్థపురం, బతుకమ్మ కాలనీలకు నీటిపారుదల శాఖ అధికారులు ఇటీవల డ్యామ్ సేఫ్టీ నిబంధనల ప్రకారం నివాసాన్ని వదిలి ప్రత్యామ్నాయం చూసుకోవాలని నోటీసులు జారీ చేశారు. ఈ పరిణామాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్ బిఆర్ఎస్ నేతలతో కలిసి కాలనీలను సందర్శించి, స్థానికుల ఆవేదనను పరిశీలించారు. "30 ఏళ్లుగా ప్రభుత్వ అనుమతులతో ఇళ్లలో జీవనం కొనసాగిస్తున్నాం. ఇప్పుడు కూలగొడతామని అంటున్నారు. మా బతుకేం?" అంటూ కాలనీవాసులు కన్నీటి పర్యంతమయ్యారు. పేదల సమస్యలపై స్పందించిన గంగుల, నీటిపారుదల శాఖ అధికారులను హెచ్చరించారు. "హైడ్రలాగా ఇక్కడా ఇల్లు కూలగొడతే ఊరుకోబోము. పేదల ఇండ్లు కూలుస్తామంటే బిఆర్ఎస్ పార్టీ చెరగదు," అని గట్టిగా వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పలువురు బిఆర్ఎస్ నాయకులు, సుమారు 200 మంది కాలనీవాసులు పాల్గొన్నారు. సమస్య పరిష్కారానికి ప్రభుత్వం తక్షణం స్పందించాలని ఎమ్మెల్యే గంగుల డిమాండ్ చేశారు.

# జయశంకర్ కలను సాకారం చేసిన కాంగ్రెస్



**కమాన్‌పూర్, ఆగస్టు 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ రాష్ట్ర స్వాప్నికుడు ప్రొఫెసర్ జయశంకర్ కలను నిజం చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్, మండల అధ్యక్షులు సయ్యద్ అన్వర్ పేర్కొన్నారు. జయశంకర్ జయంతి సందర్భంగా కమాన్‌పూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ ఇనగంటి భాస్కరరావు, కాంగ్రెస్ నాయకులు ఎల్లే రామ్మూర్తి, మల్యాల తిరుపతి, దాసరి గట్టయ్య, అబ్దుల్ రఫీక్, బొంపల్లి రాజయ్య, బొల్లపల్లి శంకర్ గౌడ్, కిషన్ రెడ్డి, అనవేన లక్ష్మీరాజం, పిల్లి శేఖర్, కుక్క రవి, గడ్డం బాపు, ఎరుకల బాబురావు, తీగల సమ్మయ్య, ఎండి చాంద్ పాషా, బోనాల సత్యం, రామస్వామి, గెల్లి లింగయ్య, చాట్ల గట్టయ్య, మల్యాల మహేష్, రఫిక్ సోహెల్ తదితరులు పాల్గొన్నారు.

# ముస్లిం రిజర్వేషన్ల కోసమే కాంగ్రెస్ ధర్నా

## బీసీల మద్దతు లేదన్న బీజేపీ



**హుజురాబాద్, ఆగస్టు 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ముస్లింలకు 100 శాతం రిజర్వేషన్ల అమలుకు కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ధర్నా బీసీల హక్కుల కోసం కాదని, మైనారిటీ ఓట్ల కోసం మాత్రమేనని బీజేపీ ఆరోపించింది. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌పై కాంగ్రెస్ మాట తప్పిందని, బీసీలకు హామీ ఇచ్చిన 42 శాతం రిజర్వేషన్లలో 10 శాతం ముస్లింలకు కట్టబెట్టే కుట్ర జరుగుతోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి విమర్శించారు. ఇల్లందకుంట మండలం లక్ష్మాజీపల్లి గ్రామంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ బీసీలను మోసం చేస్తోందని, ముస్లింల ప్రయోజనాల కోసం బీసీల హక్కులను పక్కదారి పట్టిస్తోందని ఆరోపించారు. "42 శాతం రిజర్వేషన్లలో బీసీలకు కేవలం 32 శాతం మాత్రమే మిగులుతుంది. మిగిలిన వాటిని ముస్లింలకు కట్టబెట్టే ప్రయత్నం జరుగుతోంది," అని ఆయన అన్నారు. బీసీ సమాజం ఈ కుట్రను గుర్తించి కాంగ్రెస్ ధర్నాకు మద్దతు ఇవ్వలేదని, కామారెడ్డి డిక్లరేషన్ ముస్లిం డిక్లరేషన్‌గా మారిందని విమర్శించారు. "బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామంటే బీజేపీ మద్దతు ఇస్తుంది. కానీ కాంగ్రెస్ పార్టీకి బీసీలపై చిత్తశుద్ధి లేదు," అని ఆయన అన్నారు. 50 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఒక్క బీసీని ప్రధాని లేదా సీఎం చేసిన దాఖలాలు లేవని, నామినేటెడ్ పదవులు, ఎంపీ సీట్లు కూడా బీసీలకు తక్కువగా ఇచ్చారని ఆయన ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై కేంద్రంపై నెపం మోపి తప్పించుకునే ప్రయత్నం కాంగ్రెస్ చేస్తోందని మండిపడ్డారు. తెలంగాణలో హిందువులను మైనారిటీలుగా మార్చే కుట్రకు కాంగ్రెస్ పథకం రూపొందించిందని, ఇది రాజ్యాంగ విరుద్ధమని ఆయన ఆరోపించారు. "బీసీలకు కేంద్రంలో 27 మంది మంత్రులు, అనేక రాష్ట్రాల్లో సీఎంలుగా అవకాశం కల్పించిన ఘనత బీజేపీదే," అని గంగాడి కృష్ణారెడ్డి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బైరెడ్డి రమణారెడ్డి, ర్యాకం శ్రీనివాస్, తుమ్మ శోభన్ బాబు, ఆరెల్లి శ్రీనివాస్, ఎల్లారెడ్డి, రత్నాకర్, రాంబాబు, లింగారెడ్డి, తడిగోప్పుల రమేష్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ వ్యాఖ్యలు బీజేపీ నేతలు, ముఖ్యంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన ఆరోపణలతో సరిచూసుకోవచ్చు. ఆయన కూడా కాంగ్రెస్ ధర్నా ముస్లిం రిజర్వేషన్ల కోసమేనని, బీసీల మద్దతు లేకుండా జరుగుతోందని పేర్కొన్నారు.

# తల్లిపాలతో శిశువుకు రోగ నిరోధక శక్తి

## కలెక్టర్ పమేలా సత్పతి




**కరీంనగర్, ఆగస్టు 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తల్లిపాలు శిశువుకు ఆరోగ్య రక్షణ కవచంగా నిలుస్తాయని, పుట్టిన గంటలోపే ముర్రుపాలు తాగించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా జిల్లా కేంద్రంలోని మాతా శిశు ఆరోగ్య సంరక్షణ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. చల్మెడ వైద్య కళాశాల విద్యార్థులు తల్లిపాల ప్రాముఖ్యతను నాటక రూపంలో వివరించగా, గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. తొలి ఆరు నెలలు తల్లిపాలే ఇవ్వాలని, అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందే పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకాడే మాట్లాడుతూ, ఏడాది పాటు తల్లిపాలు ఇవ్వాలని, మూఢనమ్మకాలకు దూరంగా ఉండి వైద్యుల సూచనలు పాటించాలని తల్లులకు సూచించారు. అనంతరం బాలింతలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిండెండెంట్ వీరారెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, ఆర్ఎంవో నవీన, సనా, సిడిపిఓ సబిత తదితరులు పాల్గొన్నారు.

# జయశంకర్ ఆశయాలను కొనసాగించాలి

## - కలెక్టర్ పమేలా సత్పతి



**కరీంనగర్, ఆగస్టు 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి ప్రేరణగా నిలిచిన సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పిలుపునిచ్చారు. నగరంలోని మదీనా కాంప్లెక్స్‌లో ఉన్న జయశంకర్ విగ్రహానికి కలెక్టర్, అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకాడే, లక్ష్మీ కిరణ్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన జయంతి కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి జయశంకర్ సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ వెంకటేశ్వర్లు, డీఇఓ చైతన్య జైనీ, ఇతర జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

# తపస్ సభ్యత్వ అభియాన్

## - ఉపాధ్యాయుల డిమాండ్లు



**కరీంనగర్, ఆగస్టు 6(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) కరీంనగర్ జిల్లా ఆధ్వర్యంలో గన్నేరువరం మండలంలోని పాఠశాలల్లో సభ్యత్వ నమోదు నిర్వహించారు.
ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమనేని తిరుపతిరావు మాట్లాడుతూ, పదోన్నతుల్లో నాన్ జాయినింగ్ ఖాళీలను ప్రస్తుత సీనియారిటీ జాబితాలోని అభ్యర్థులతో భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే, పెండింగ్ బిల్లులు, డీఏలు విడుదల చేసి పీఆర్సీ అమలు చేయాలని కోరారు. ప్రాథమిక పాఠశాల హెచ్ఎం పోస్టుల భర్తీపై కూడా చురుకైన చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ మేయర్ రవీందర్ సింగ్ జన్మదిన వేడుకలు



**కరీంనగర్, ఆగస్టు 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
బిఆర్ఎస్ సీనియర్ నేత, కరీంనగర్ మాజీ మేయర్ శ్రీ సర్దార్ రవీందర్ సింగ్ జన్మదినాన్ని పురస్కరించుకుని స్థానికంగా ఘనంగా వేడుకలు నిర్వహించారు. పెండ్యాల మహేష్ కుమార్ ఆధ్వర్యంలో మార్కెట్ వద్ద వెంకటేశ్వర దేవాలయం ప్రాంగణంలో కేక్ కట్ చేసి, 50 మందికి భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు కేంసారం తిరుపతి, ప్యాట సురేష్, పటేల్ అనిల్, శ్రావణ్, వినోద్, సాయి, ఠాకూర్ ఆశ, లక్ష్మి, స్వరూప, రామలక్ష్మి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ పోలీస్ కార్యాలయంలో జయశంకర్ జయంతి వేడుకలు




**కరీంనగర్, ఆగస్టు 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ రాష్ట్ర ప్రత్యేకత కోసం జీవితాన్ని అర్పించిన సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతిని పురస్కరించుకుని కరీంనగర్ పోలీస్ కమీషనరేట్ కార్యాలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఇతర అధికారులు, పోలీస్ సిబ్బంది ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. జయశంకర్ గారు 1969 ఉద్యమం నుంచి మలిదశ తెలంగాణ ఉద్యమం వరకు ప్రజల ఆకాంక్షలకు మార్గదర్శిగా నిలిచారని, ఆయన జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని వెంకటరమణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీసీపీ భీం రావు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు రజినీకాంత్, జానిమియ, శ్రీధర్ రెడ్డి, ఇన్స్పెక్టర్ ఓ. వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# జయశంకర్‌ను తెలంగాణ జాతిపితగా గుర్తించాలని డిమాండ్



**ఎల్బీనగర్, ఆగస్టు 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి సైద్ధాంతిక బలాన్ని అందించిన ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్‌ను "తెలంగాణ జాతిపిత"గా గుర్తించాలని శ్రీశ్రీ విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు నారోజు కుమారస్వామి చారి డిమాండ్ చేశారు. జయశంకర్ 91వ జయంతి సందర్భంగా ఎల్బీనగర్‌లోని విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "జయశంకర్ సార్ ఒక వ్యక్తి కాదు, ఒక శక్తి. ఆయన జీవితం తెలంగాణ ప్రజలకు స్ఫూర్తిదాయకం. 1952 నాన్ ముల్కీ ఉద్యమం నుంచి 1969 ఉద్యమం వరకు ఆయన పోరాటం చరిత్రను మలిచింది. ఆయన ఆశయాలను కొనసాగించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది," అని పేర్కొన్నారు. జయశంకర్ తెలంగాణ ఉద్యమానికి మార్గదర్శకుడిగా నిలిచినట్లు పలువురు నేతలు గుర్తు చేశారు. ఆయనకు జాతిపిత హోదా కల్పించి, ట్యాంక్‌బండ్ లేదా అసెంబ్లీ ఆవరణలో 76 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, జయంతి, వర్ధంతి రోజులను ప్రభుత్వ సెలవు దినాలుగా ప్రకటించాలని సంఘం తరఫున డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మదన్మోహన్, పులిగిల్ల శ్రీనివాసచారి, జగ్జీవన్ చారి, బండి కట్ల వెంకటేశ్వర్లు, బండోజు రవి చారి, శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# వాసవి వృద్ధాశ్రమంలో నూతన కమిటీ ప్రమాణ స్వీకారం



**కరీంనగర్, ఆగస్టు 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వాసవి వృద్ధాశ్రమంలో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం సోమవారం ఉదయం జరిగాయి. అధ్యక్షుడు సామ నారాయణ, ప్రధాన కార్యదర్శి కొమురవెల్లి వెంకటేశం, కోశాధికారి గుడిసె రాజేంద్రప్రసాద్ సహా పలువురు కార్యవర్గ సభ్యులు పదవీ బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో గౌ. అధ్యక్షులు చిట్టుమల్ల కొండయ్య, పూర్వ అధ్యక్షులు కొంతం కృష్ణమూర్తి, పాత శేఖర్ పాల్గొన్నారు. అనంతరం వనమహోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు.

# వెల్దండలో వేట కొడవళ్లతో దాడి

## – వ్యక్తి మృతి



**వెల్దండ, ఆగస్టు 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వెల్దండ మండల కేంద్రంలో రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో బెల్లంకొండ రాములు (40) అనే వ్యక్తి వేట కొడవళ్లతో దాడికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. కల్వకుర్తికి చెందిన కొందరు పందులు దొంగిలించారని నెపంతో ఈ దాడి జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. మృతుని బంధువులు కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# నారాయణ అంత్యక్రియలకు హాజరైన మంచిరెడ్డి కిషన్ రెడ్డి



**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** బిఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి తన వ్యక్తిగత సహాయకుడు కుంబం శ్రీనివాస్ తండ్రి కుంభం నారాయణ (85) మృతికి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం రాత్రి తుదిశ్వాస విడిచిన నారాయణ అంత్యక్రియలు నల్గొండ జిల్లా చిట్యాల మండలంలోని ఉరుమడ్ల గ్రామంలో బుధవారం మధ్యాహ్నం నిర్వహించగా, మంచిరెడ్డి స్వయంగా హాజరై కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "శ్రీనివాస్ కుటుంబానికి మేము అండగా ఉంటాం. నారాయణ గారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తున్నాం" అని పేర్కొన్నారు. అంత్యక్రియల్లో బిఆర్ఎస్ రాష్ట్ర నేతలు క్యామ మల్లేష్, ప్రశాంత్ రెడ్డి, సత్తు వెంకటరమణారెడ్డి, వంగేటి లక్ష్మారెడ్డి, కృపేష్, నర్మద, భరత్, బుగ్గరాములు, రమేశ్ గౌడ్, చీరాల రమేశ్, కొత్త కిషన్ గౌడ్, విఠల్ రెడ్డి, మంద సురేష్, పాలకూర్ల వెంకటేష్ గౌడ్, చక్రవర్తి గౌడ్, పాశం దామోదర్, అనంతుల వెంకటేశ్వర్ రెడ్డి, తుమ్మలపల్లి వెంకట్ రెడ్డి, బహదూర్ నాయక్, జెర్కోని రాజు, శంకర్ నాయక్, జానీపాష, ఖాజా మహ్మద్, పాశం పవన్, పాతూరి రవిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ బాలుడికి ఎన్ఆర్ఐ సూరపనేని కృష్ణ ప్రసాద్ ఆర్థిక సహాయం







**హైదరాబాద్, ఆగస్టు 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని యలమర్తి గురు రాఘవేంద్ర అనే 7వ తరగతి విద్యార్థికి ఎన్ఆర్ఐ సూరపనేని కృష్ణ ప్రసాద్ రూ.20,000 ఆర్థిక సహాయం అందించారు. నల్ల జైకన్ స్కూల్‌లో చదువుతున్న రాఘవేంద్ర తండ్రి చిన్నచితక పనులతో కుటుంబాన్ని పోషిస్తూ, కొడుకు చదువుకు తగిన సహాయం చేయలేక ఇబ్బంది పడుతున్న పరిస్థితిని గమనించిన అమోఘ నరేంద్ర, అంచి నరేంద్ర, యం. రవి మిత్రులు కృష్ణ ప్రసాద్‌ను సంప్రదించి ఈ సహాయాన్ని కల్పించారు. ఈ సందర్భంగా బాలుడి తండ్రి కన్నీటి పర్యంతమై, సహాయం చేసినవారికి కృతజ్ఞతలు తెలిపారు. "చదువుతో ముందుకు సాగుతున్న కొడుకుకు అండగా నిలిచిన మీ అందరికీ మా కుటుంబం ఎప్పటికీ రుణపడి ఉంటుంది," అని భావోద్వేగంగా స్పందించారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో కురుమల సత్తా చాటాలి

## కడారి అయిలన్న కురుమ



**చొప్పదండి, ఆగస్టు 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** చొప్పదండి నియోజకవర్గంలోని కోట్ల నర్సింహులపల్లె వీరభద్రస్వామి దేవాలయ ఆవరణలో కురుమ సంఘం ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కురుమ సంఘం అధ్యక్షులు కడారి అయిలన్న కురుమ మాట్లాడుతూ, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కురుమలు ప్రతి పార్టీలో, ప్రతి స్థాయిలో పోటీకి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. గతంతో పోలిస్తే నేటి కురుమ యువత విద్య, ఉద్యోగ, రాజకీయ, ఆర్థిక రంగాల్లో ముందుకు సాగుతున్నారని, ప్రభుత్వానికి చెల్లిస్తున్న పన్నుల మేరకు తమ వాటాను సాధించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గొర్రెల పెంపకం వృత్తి క్షీణిస్తున్న నేపథ్యంలో, ప్రభుత్వ ప్రోత్సాహంతో ఈ వృత్తిని అభివృద్ధి చేయాలని, 50 ఏళ్లు దాటిన గొర్రెల కాపరులకు పెన్షన్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి కురుమ సంఘం నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, మహిళా సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# బీసీల సమస్యలపై కేంద్రం స్పందించాలి

## – బుచ్చన్న యాదవ్



**కరీంనగర్, ఆగస్టు 6(నీలగిరి ఎక్స్ ప్రెస్):** తెలంగాణ రాష్ట్ర బీసీల సమస్యలపై కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కటిక రెడ్డి బుచ్చన్న యాదవ్ డిమాండ్ చేశారు. "42 శాతం రిజర్వేషన్ బిల్లును రాష్ట్ర శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించి గవర్నర్‌కు పంపినా కేంద్రం స్పందించకపోవడం కపట ప్రేమకు నిదర్శనం" అని విమర్శించారు. "బీసీ ప్రధానమంత్రిగా చెప్పుకునే మోడీకి బీసీల డిమాండ్లు పట్టవా?" అని ప్రశ్నించిన ఆయన, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు బీసీ బిల్లును రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చించాలని కోరారు. లేదంటే చరిత్రలో బీసీ ద్రోహులుగా మిగిలిపోతారని హెచ్చరించారు. కేంద్రం మొండి వైఖరి విడనడి, బీసీలకు రిజర్వేషన్లు కల్పించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ప్రజా ఉద్యమాలు చేపడతామని బుచ్చన్న యాదవ్ స్పష్టం చేశారు.

# ఘనంగా గద్దర్ రెండవ వర్ధంతి



**అచ్చంపేట, ఆగస్టు 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రజా ఉద్యమ కవి గద్దర్ రెండవ వర్ధంతిని అచ్చంపేట పట్టణ కేంద్రంలో విగ్రహ నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రజల హక్కుల కోసం తన జీవితాన్ని అర్పించిన గద్దర్ ఆశయాలను కొనసాగించాల్సిన అవసరం ఉందని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నల్లమల యదన్న, చేవ్వ పాండ, జక్కా నాగేష్, గోపాల్, పాతుకుల శ్రీశైలం, కళాకారులు అనిల్, అర్జున్, సుధాకర్, మాణిక్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# సుష్మా స్వరాజ్ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు



**కరీంనగర్, ఆగస్టు 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పట్టణంలోని 63వ డివిజన్ సుష్మా స్వరాజ్ చౌరస్తాలో బీజేపీ నేతలు కేంద్ర మాజీ మంత్రి సుష్మా స్వరాజ్ 6వ వర్ధంతిని పురస్కరించుకుని ఘనంగా నివాళులర్పించారు. చౌరస్తా వ్యవస్థాపకులు రెడ్డెడ్డి శ్రీనివాస్ (బాలు) ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి స్మరణ చేశారు. ఈ కార్యక్రమానికి వెస్ట్ జోన్ కన్వీనర్ జాడి బాల్ రెడ్డి, మాజీ కన్వీనర్ నరహరి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై, పార్లమెంటులో ఆమె పోరాట శైలిని గుర్తు చేశారు. 163వ పోలింగ్ బూత్ అధ్యక్షులు పబ్బల ఆంజనేయులు, వల్లెం సంజయ్ కుమార్, కర్రె రాజ మల్లయ్య, దయ్యాల సంజీవ్ కుమార్, పరకాల ఆంజనేయులు, పెంట శ్రీనివాస్, ఎన్నం ప్రకాష్, సాన కొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# జీడిమెట్లలో వీరాంజనేయ ఆలయ వార్షికోత్సవం

## – ఎమ్మెల్యే వివేకానంద్ ప్రత్యేక పూజలు



**జీడిమెట్ల, ఆగస్టు 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** 132వ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వర కాలనీ ఈస్ట్‌లో శ్రీ సంకట విమోచన వీరాంజనేయ ఆలయ తృతీయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "దేవతారాధనతో మానసిక ప్రశాంతత చేకూరుతుంది. స్వామి వారి ఆశీస్సులతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలి" అని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి చక్రవర్తి, ట్రెజరర్ వెంకట్రెడ్డి, సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సమ్మయ్య, శంకర్, రామచందర్, రాజ్ కుమార్, ఓబయ్య, గంగాధర్, బిఆర్ఎస్ నాయకులు కుంట సిద్ధిరాములు, నరేందర్ రెడ్డి, సంపత్ గౌడ్, ఎల్లా గౌడ్, శంకర్, బాల మల్లేష్, కాలే నాగేష్, బలరాం, నార్లకంటి కుమార్, శ్రీకాంత్, ఉమాపతి, వేణుగోపాల్, సతీష్, ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ వసూలు తదితరులు పాల్గొన్నారు.

# బాచుపల్లిలో సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన



**బాచుపల్లి, ఆగస్టు 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రాజీవ్ గాంధీ నగర్ (రోడ్ నం.16) లో సీసీ రోడ్డు మరియు డ్రైనేజీ పూర్తిగా పాడవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న బస్తీవాసుల విజ్ఞప్తిపై స్పందించిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి, మున్సిపల్ ఫండ్స్ ద్వారా పనులకు మంజూరు చేయించి శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బస్తీవాసులు ఆయనకు శాలువా కప్పి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొలన్ కృష్ణ రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొలన్ వీరేందర్ రెడ్డి, ఎన్ఎంసీ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, జనరల్ సెక్రటరీ కొలన్ జీవన్ రెడ్డి, కొలన్ బాల్ రెడ్డి, కాంగ్రెస్ నేతలు తిరుపతి రెడ్డి, తడకండి సాయిరాజ్, ఎర్రోళ్ల విష్ణు, ఎత్తరి నాని, మొహమ్మద్ షకిల్, బొమ్రాజ్ తదితరులు పాల్గొన్నారు.




# ఘాటి ట్రైలర్ విడుదల

## సీతమ్మోరు లంకా దహనం చేస్తే ఎట్టుంటదో చూద్దురు కానీ ....

లేడీ సూపర్ స్టార్ అనుష్క శెట్టి తన కెరీర్ స్పీడ్ పెంచింది. రెండు సంవత్సరాల క్రితం వచ్చిన మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి సినిమా మంచి విజయాన్ని అందుకుని, ఆమెకు మళ్లీ బజ్ తీసుకువచ్చింది. ఇప్పుడు అనుష్క మరో ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రానుంది. అదే 'ఘాటి' . ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నాడు క్రిష్ జాగర్లమూడి. ఈ క్రేజీ కాంబినేషన్ గతంలో వేదం సినిమాతో తెలుగు ప్రేక్షకుల మనసుల్లో ఓ ప్రత్యేక స్థానం ఏర్పరిచింది. చాలా కాలం తర్వాత ఈ ఇద్దరూ కలిసి మళ్లీ ఘాటి కోసం జతకట్టారు. ఆసక్తికరమైన విషయం ఏంటంటే, ఈ సినిమా కోసమే క్రిష్ తన మరో సినిమా హరిహర వీరమల్లును తాత్కాలికంగా విరమించాడన్న వార్తలు ఇండస్ట్రీలో చక్కర్లు కొట్టాయి. అయితే తాజాగా మూవీ ట్రైలర్ విడుదల చేశారు.ట్రైలర్‌లో ప్రతి సన్నివేశం ఆకట్టుకుంటుంది.విలేజ్ మహిళా మాస్ అవతార్‌లో అనుష్క లుక్ బాగుంది. ఆమె యాక్షన్ సీక్వెన్సెస్‌లో అదరగొట్టింది. ట్రైలర్ మొత్తం కూడా యాక్షన్ డ్రాప్‌లోనే సాగింది. చివరలో సీతమ్మోరు లంకా దహనం చేస్తే ఎట్టుంటదో చూద్దురు కానీ.. అనే పవర్ ఫుల్ డైలాగ్ వినిపించింది. మిగతా డైలాగ్స్ కూడా చాలా పవర్ ఫుల్‌గా ఉన్నాయి.మూవీని సెప్టెంబర్ 5, 2025న విడుదల చేయబోతున్నట్టు మేకర్స్ ట్రైలర్ ద్వారా తెలియజేశారు. ట్రైలర్ చూస్తుంటే ఈ మూవీతో అనుష్క మరో భారీ హిట్ కొట్టడం ఖాయంగా కనిపిస్తుంది. విక్రమ్ ప్రభు, అనుష్క శెట్టి ప్రధాన పాత్రలలో దర్శకుడు క్రిష్ జాగర్లమూడి ఈ చిత్రాన్ని యూవీ క్రియేషన్స్ బేనర్‌పై తెరకెక్కిస్తున్నాడు. ఇప్పటికే సినిమా నుంచి వచ్చిన పోస్టర్లు, టీజర్, సాంగ్స్ అందరినీ ఆకట్టుకుని, సినిమా పట్ల అంచనాలను హైకు తీసుకెళ్లాయి. ముఖ్యంగా అనుష్కను మరో కోణంలో చూపించేందుకు క్రిష్ తీసుకున్న ఈ కొత్త ప్రయత్నం చర్చనీయాంశంగా మారింది. ఈ సినిమా ఎప్పుడో విడుదల కావల్సి ఉన్నా అనేక కారణాల వల్ల రిలీజ్ వాయిదా పడుతూ వచ్చింది. మధ్యలో రిలీజ్ డేట్‌కు సంబంధించి ఎలాంటి క్లారిటీ కూడా ఇవ్వలేదు.మొత్తానికి ఈ చిత్రం సెప్టెంబర్ 5న విడుదల కానుండడంతో ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

# పెద్ది కోసం కిస్సిక్ బ్యూటీ..

## రంగస్థలంలో ఉన్నట్లే పెద్ది సినిమాలో ఒక ఐటెంసాంగ్



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం పెద్ది . ఈ సినిమాలో రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్ హీరోయిన్ గా నటిస్తోంది. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, ఫస్ట్ గ్లింప్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. టాలీవుడ్ మాత్రమే కాదు పాన్ ఇండియా మొత్తం ఈ సినిమా కోసం వెయ్యి కళ్ళతో ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది.ఇక తాజాగా పెద్ది సినిమా గురించిన ఒక వార్త సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. ఈ సినిమాలో కూడా రంగస్థలంలో ఉన్నట్లే ఒక ఐటెంసాంగ్ ఉందట. ఉత్తరాంధ్ర ఫోక్ సాంగ్ గా ఈ సాంగ్ ను తెరకెక్కించబోతున్నారని తెలుస్తోంది. ఇక ఈ సాంగ్ లో చరణ్ పక్కన చిందేయ్యడానికి అందాల భామ శ్రీలీల ను రంగంలోకి దించారని వార్తలు వినిపిస్తున్నాయి. ఈ మధ్యకాలంలో స్టార్ హీరోయిన్లు.. స్పెషల్ సాంగ్స్ చేయడానికి ఏ మాత్రం వెనుకాడడం లేదు. ఇప్పటికే శ్రీలీల.. కిస్ కిస్ కిస్సిక్ అంటూ పుష్ప 2 లో బన్నీ సరసన ఆడిపాడింది.కిస్సిక్ సాంగ్ శ్రీలీల రేంజ్ నే మార్చేసింది. అందుకే చరణ్ కు ధీటుగా డ్యాన్స్ వేసే హీరోయిన్ కోసం వెతికి వెతికి చివరకు శ్రీలీల వద్ద వచ్చి ఆగాడట బుచ్చిబాబు. ఇక ఇప్పటికే శ్రీలీలను సంప్రదించగా అమ్మడు కూడా సై అనేసిందని సమాచారం. త్వరలోనే వీరి మధ్య సాంగ్ షూటింగ్ ను మొదలుపెట్టనున్నారట. ఇదే కనుక నిజం అయితే థియేటర్ లో వీరిద్దరి డ్యాన్స్ కు బాక్సులు బద్దలు అవ్వడం ఖాయమే అని చెప్పాలి. నిజం చెప్పాలంటే శ్రీలీలకు ఈ మధ్య ఐటెంసాంగ్స్ నే బాగా పేరు తెస్తున్నాయి. ఇక సినిమాల విషయానికొస్తే పరాజయాలతోనే నెట్టుకొస్తోంది. ప్రస్తుతం అమ్మడి ఆశలన్నీ మాస్ జాతర పైనే పెట్టుకుంది. మరి ఆ సినిమా అమ్మడికి హిట్ ను అందిస్తుందా.. ? లేక మళ్లీ పెద్ది లోని ఐటెంసాంగ్ తోనే పేరు తెచ్చుకుంటుందా.. ? అనేది చూడాలి.



# పెళ్లి చేసుకుని..
# పిల్లలు కనాలని ఉంది..
# కానీ అది ఒక్కటే ప్రాబ్లెమ్

నాకు పెళ్లి చేసుకోవాలని ఉంది.. పిల్లలు కనాలని ఉంది అని అంటున్నారు మృణాల్ ఠాకూర్ అదేదో జస్ట్ ఇప్పుడు పుట్టిన ఆలోచన కాదు. ఎప్పటి నుంచో ఉంది. నా చిన్నప్పటి నుంచీ నాదైన కుటుంబం మీద నాకు చాలా క్లారిటీ ఉంది అని చెబుతున్నారు.కెరీర్ పీక్స్ లో ఉన్నప్పుడు ఈ మాటలేంటని విన్నవారందరూ వండర్ అవుతున్నారు. కెరీర్‌కీ, పెళ్లికి సంబంధం ఉందా? అంటే కచ్చితంగా ఉంటుందనే అంటున్నారు మృణాల్. ఇప్పుడు డైరీల్లో కాల్షీట్లన్నీ ఫుల్‌గా ఉన్నాయి.ఏడాదికి రెండు, మూడు సినిమాల రిలీజులున్నాయి. వాటి షూటింగులు, ప్రమోషన్లు, డబ్బింగ్‌లూ అంటూ చాలా బిజీగా ఉన్నాను. అందుకే పెళ్లి ఇమీడియేట్‌గా చేసుకోవాలని అనుకోవడం లేదని స్టేట్‌మెంట్ ఇచ్చేశారు.పెళ్లి గురించి ఇంతగా మాట్లాడుతున్నారంటే.. మనసులో ఎవరైనా ఉన్నారా? అనే అనుమానాలు వెంటనే మొదలవుతాయి. అలాంటిదేమీ లేదు. సరైన టైమ్ వచ్చినప్పుడు అన్నీ పర్ఫెక్ట్ గా కుదురుతాయన్నది నా నమ్మకం అని అడగబోయే ప్రశ్నకు ముందుగానే ఆన్సర్ ఇచ్చేస్తున్నారు ఈ లేడీ.నార్త్ లో వరుసగా ప్రాజెక్టులు సైన్ చేస్తున్నారు మృణాల్. సౌత్‌లో అల్లు అర్జున్ – అట్లీ మూవీలోనూ మంచి రోల్ చేస్తున్నారు. కోలీవుడ్ నుంచి చాలా మంది కథలు వినిపిస్తున్నారట. బిజీగా ఉండాలనో, సంపాదించేయాలనో సినిమాలు చేయట్లేదట మృణాల్. మంచి సబ్జెక్టులో ఇన్వాల్వ్ అయితే ఆ కిక్కే వేరన్నది ఈ లేడీ ఫీలింగ్. గుర్తుండిపోయే సినిమాలు చేయాలన్నదే టార్గెట్ అంటున్నారు హాయ్ నాన్న బ్యూటీ.



# ఇంట్రెస్టింగ్ టైటిల్‌తో మంచు మనోజ్ కొత్త సినిమా..



టాలీవుడ్ రాకింగ్ స్టార్ మంచు మనోజ్ గురించి ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేదు. ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి నేటికి ఆయనకి 21 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ సుదీర్ఘ ప్రయాణంలో మంచి విజయాలతో పాటు ఎన్నో ఒడిదుడుకులను కూడా ఎదుర్కొన్నారు. చాలా కాలంగా సినిమాలకి దూరంగా ఉన్న మనోజ్ ఇటీవల భైరవం అనే చిత్రంతో పలకరించాడు. మల్టీ స్టారర్ చిత్రంగా ఈ మూవీ అలరించింది. ఇక ఇప్పుడు మళ్లీ ఒక పవర్‌ఫుల్ సినిమాతో రెడీ అయ్యారు. తాజాగా "డేవిడ్ రెడ్డి" అనే టైటిల్‌తో మనోజ్ 21వ సినిమాను అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రాన్ని దర్శకుడు హనుమ రెడ్డి యక్కంటి డైరెక్ట్ చేయగా, వెల్వెట్ సోల్ మోషన్ పిక్చర్స్ నిర్మిస్తోంది. విడుదలైన టైటిల్ పోస్టర్, మేకర్స్ విడుదల చేసిన సమాచారం ఈ ప్రాజెక్టుపై భారీగా ఆసక్తిని పెంచాయి.ఈ సినిమా కథ 1897 నుంచి 1922 మధ్యకాలాన్ని ఆధారంగా చేసుకుని రూపొందుతుంది. బ్రిటిష్ సామ్రాజ్యాన్ని ఎదుర్కొంటూ, కుల అణచివేతకు వ్యతిరేకంగా పోరాడిన ధైర్యవంతుడి కథగా ఇది తెరకెక్కుతోంది. మనోజ్ ఈ సినిమాలో ఇప్పటివరకు కనిపించని లుక్‌లో, ఒక విప్లవవాది పాత్రలో కనిపించనున్నారు. "మద్రాస్ ప్రెసిడెన్సీలో జన్మించాడు ఢిల్లీలో పెరిగాడు ఇప్పుడు బ్రిటిష్ సామ్రాజ్యాన్ని కదిలించాడు అనే స్టేట్మెంట్‌తో రివీల్ చేసిన టైటిల్ పోస్టర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. ఇటీవల భైరవం సినిమాలో తన యాక్టింగ్ స్కిల్స్‌తో ప్రశంసలు అందుకున్న మనోజ్, ఇప్పుడు మిరాయ్ అనే చిత్రంలో విలన్‌గా నటిస్తున్నారు. అలాగే "డేవిడ్ రెడ్డి"లో మరింత పవర్‌ఫుల్‌గా కనిపించబోతున్నారు.సినిమా కేవలం యాక్షన్ డ్రామా కాదు, ఒక చారిత్రక నేపథ్యంతో కూడిన భావోద్వేగాలు, తాత్వికత కలగలిసిన హై ఓక్టేన్ డ్రామాగా రూపొందుతోందని తెలుస్తోంది.టాలీవుడ్ సినీ ఇండస్ట్రీలో మనోజ్ 21 సంవత్సరాల జర్నీని బ్యాంగ్‌తో సెలబ్రేట్ చేస్తున్నారు. ఈసారి, ఒక నిర్భయ తిరుగుబాటు దారుడిగా వస్తున్నారు. #MM21 టైటిల్ 'డేవిడ్ రెడ్డి'. ఇది 1897 –1922 నేపథ్యంలో సాగే తీవ్రమైన చారిత్రక యాక్షన్ డ్రామా" అని చిత్రబృందం తెలిపింది. తాజాగా రిలీజ్ అయిన పోస్టర్ సినిమాపై భారీ హైప్‌ను క్రియేట్ చేస్తోంది. మనోజ్ కెరీర్‌లో మైలురాయిగా నిలిచే అవకాశం ఉన్న ఈ చిత్రంపై అభిమానులు భారీ అంచనాలతో ఎదురు చూస్తున్నారు. మరి ఈ సినిమా మనోజ్‌కి కంబ్యాక్ హిట్ ఇస్తుందా? అసలు "డేవిడ్ రెడ్డి" అనే పాత్రలో మనోజ్ ఎలా కనిపిస్తారు? అనేది తెలుసుకోవాలంటే కొద్ది రోజులు వేచి చూడక తప్పదు.